www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను


ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -07 సోమవారం 20 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుందని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విద్యుత్ భారం తగ్గితే ఆ నిధులను ఇతర కార్యక్రమాలకు వాడవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జలధార-హారతి కార్యక్రమంపై చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ జరిపారు. క్షేత్రస్థాయిలో జలధార-జలహారతి పనులను సిఎంకు అధికారులు వివరించారు. 'జలధార' కు అన్నమయ్య కలెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించారు. జలధార కింద అన్ని ఆలయాల

మిగతా2లో...

## నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..



**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** యావత్ తెలంగాణ ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'కు సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్‌ను వీడి కారెక్కుతున్న సీనియర్ నేత జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించే ఘట్టానికి సభా ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు(సోమవారం) సాయంత్రం 4:45 గంటలకు ఎర్రవల్లి నివాసం నుండి హెలికాప్టర్‌లో కేసీఆర్ జగిత్యాలకు బయలుదేరుతారు. జగిత్యాల కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో దిగి, అక్కడి నుండి నేరుగా కేసీఆర్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో గులాబీ బాస్ కీలక భేటీ నిర్వహిస్తారు. పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు

మిగతా2లో...



## తుది ఒప్పందానికి బహుదూరం

### - అమెరికాతో చర్చలపై ఇరాన్

**టెహ్రాన్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** అమెరికా, ఇరాన్ చర్చల్లో కొంత పురోగతి సాధించాయని, అయితే ఒక ఒప్పందానికి రావడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్, ప్రధాన సంధానకర్త మొమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ శనివారం ప్రభుత్వ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్న

మిగతా2లో...

# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

● గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై సీఎం రేవంత్‌రెడ్డి ● లోక్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ సందర్భంగా విజ్ఞప్తి



**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా మంత్రి అజహరుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్ పేర్లను ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి... రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి విన్నవించారు. ప్రస్తుతం అసెంబ్లీ, మండలి.. ఏ సభలోనూ అజహరుద్దీన్ సభ్యుడిగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన పేరును వెంటనే ఆమోదించాలని సీఎం... గవర్నర్‌కు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఆయన మంత్రి పదవిని చేపట్టి ఈ నెలాఖరుకు ఆర్నెల్లు పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నుకోబడాలి లేదంటే నియమించబడాలి. కానీ అజహరుద్దీన్ విషయంలో ఈ రెండూ జరగలేదు. అందువల్లే సీఎం అత్యవసరంగా గవర్నర్‌తో భేటీ అయినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

మిగతా2లో...



## వైఫల్యం మీదే.. దిగిపోండి

### ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై విపక్షాల ఆగ్రహం

### ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు లోక్‌సభలో వీగిపోయిన దరిమిలా ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగం కొత్త రాజకీయ వివాదానికి దారి తీసింది. అధికారిక జాతీయ ప్రసంగాన్ని ప్రధాని మోదీ పక్షపాత రాజకీయ ప్రసారంగా మార్చివేశారని పలువురు విపక్ష నేతలు ఆరోపించారు. తామేమీ తప్పులు చేయలేదని.. బీజేపీ ప్రభుత్వమే తప్పులు చేసిందన్నారు.

మిగతా2లో...

## బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

18 మంది మృతి, ఆరుగురికి గాయాలు




## నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్



**అమరావతి,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** తాను క్రమంగా కోలుకుంటున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం ఆయనకు శస్త్రచికిత్స జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. సర్జరీ విజయవంతమైందని, తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతోపాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ.. తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై

మిగతా2లో...

## ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

మహిళలను వంచించిన కాంగ్రెస్ కూటమి

ఈ నెల 17 మహిళల చరిత్రలో చీకటి రోజు

బిల్లు వీగిపోతే ఇండి కూటమి సంబురాలు

కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే మండిపాటు






## హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

### - వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ

**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** హైదరాబాద్‌లో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్ , పరిసర ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురుస్తోంది. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతోంది.సికింద్రాబాద్ బోయిన్ పల్లి పరిసర ప్రాంతాలలో వడగళ్ల వర్షం కురిసింది. బోయిన్ పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన

మిగతా2లో...

## రేవంత్ మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ : హరీష్ రావు



**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** సిఎం రేవంత్ రెడ్డి పోవాలి.. 4 కోట్ల తెలంగాణ ప్రజలు మాజీ సిఎం కెసిఆర్ రావాలని కోరుకుంటున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. రేవంత్ మొనగాడు కాదు..మోసగాడని ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ..క్వింటాలు మీద 7 క్వింటాళ్ల తరుగు పెట్టి గోసపెడుతున్నారని రైతులు అంటున్నారని, వడ్లు కొనడం లేదని..5 కిలోల తరుగు పెడుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో ముడుపులు కట్టడం..కుర్చీ కాపాడుకోవడం రేవంత్ రెడ్డి చేసేదని, రేవంత్ మాటలకు

మిగతా2లో...

## ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి

ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారు

కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారు

బూర్జువా పార్టీలను వదిలి జాగృతిలో చేరండి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతిలో చేరిన బోథ్ మాజీ ఎంఎల్ఏ రాథోడ్ బాపూరావు



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# ఆ ఇద్దరి పేర్లూ ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

కె.రామకృష్ణారావు కూడా ఇదే విషయాన్ని గవర్నర్ వద్ద ప్రస్తావించారు. ఒకవేళ సీఎం చేసిన విజ్ఞప్తిని గవర్నర్ తోసిపుచ్చితే ఈనెల 30 తర్వాత అజహరుద్దీన్ తన మంత్రి పదవిని వదులుకోవాల్సి ఉంటుంది. శు క్లాతో భేటీ సందర్భంగా విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించినట్టు సీఎంవో పేర్కొంది. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించాలని గవర్నర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులతో ప్రమాణం చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లోక్ భవన్ ఆధ్వర్యంలో జూన్ 12న ఎల్బీస్టేడియంలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్ల సమయంలోనే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామనే విధంగా విద్యార్థుల నుంచి ప్రమాణపత్రం తీసుకోవాలని గవర్నర్ కోరారు. ఆయన చేసిన సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉత్తరం, దక్షిణం పేరిట విభజించే కుట్ర

**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** ఈ నెల 17వ తేదీ దేశ మహిళల చరిత్రలో ఒక చీకటి రోజుగా, బ్లాక్ డేగా మిగిలిపోతుందని, ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా అలయన్స్ దేశంలోని మహిళలతో పాటు మొత్తం దక్షిణ భారత దేశాన్ని మోసం చేసిందని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే మండిపడ్డారు. మహిళలు చిరకాలంగా కోరుకుంటున్న 33 శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు, దక్షిణ దేశ రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తీసుకునివచ్చిందని ఆమె ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గుర్తు చేశారు. జనాభా నియంత్రణ పాటిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు భవిష్యత్తులో జనగణన తర్వాత అన్యాయం జరగకుండా రక్షణ కల్పించడమే ప్రధాని నరేంద్ర మోడీ ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. అయితే లోక్‌సభలో ఈ బిల్లులు విఫలమైనప్పుడు కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీల నాయకులు దేశ ప్రయోజనాలను మరిచి, ఆ వైఫల్యాన్ని పండుగలా జరుపుకున్నారని వారి నవ్వులు, హగ్‌లు దేశాన్ని ఉత్తర-దక్షిణిగా విభజించే కుట్రకు నిదర్శనమని కేంద్ర మంత్రి శోభ మండిపడ్డారు. దక్షిణ భారతానికి న్యాయం చేసే ఉద్దేశంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో మాట్లాడుతూ ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లు పెంచుతామని, కేవలం ఒక గంట సమయం ఇస్తే కొత్త బిల్లును తీసుకుని వస్తామని ప్రతిపాదించినప్పటికీ, కాంగ్రెస్, ఇండీ అలయన్స్ పార్టీలు దాన్ని తిరస్కరించాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తమ రాజకీయ లాభాల కోసం, భవిష్యత్తులో ప్రాంతీయ విభేదాలను మరింత పెంచేలా వారు వ్యవహరించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పదేళ్లుగా మహిళా సాధికారతకు పెద్ద పీట వేశామని విద్య, స్కాలర్‌షిప్‌లు, బీమా పథకాలతో పాటు ముద్ర లోన్లలో 60 శాతం, ఎంఎస్‌ఎంఇ సబ్సిడీల్లో 53 శాతం మహిళలకే అందించామని పేర్కొన్నారు. ప్రధానిగా ఎబి వాజపేయి ఉన్నప్పుడు స్వయం సహాయక సంఘాల ఆలోచనను విస్తరించి, ఇప్పుడు 3 కోట్లకు పైగా మహిళలను 'లఖ్ పతి దీదీలు'గా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, మహిళ చేతిలో డబ్బు ఉంటే కుటుంబానికి, దేశానికి మేలు జరుగుతుందని ఆమె అన్నారు. నేటి మహిళలు రక్షణ రంగంలో ఫైటర్ జెట్‌లు నడుపుతూ దేశానికి సేవ చేస్తున్నారని, అయినప్పటికీ రాజకీయాల్లో వారికి సరైన అవకాశాలు రాకుండా కాంగ్రెస్ వంటి పార్టీలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వంలో ముద్ర లోన్లలో 63-64 శాతం మహిళలకే దక్కాయని, ఎంఎస్‌ఎంఈ సబ్సిడీలు 53 శాతానికి పైగా మహిళలు పొందారని స్పష్టం చేశారు. కర్నాటక కోస్టల్ ప్రాంతంలోని మత్స్యకార మహిళల జీవనశైలిని ఉదాహరణగా చూపుతూ, మహిళల చేతిలో ఆర్థిక శక్తి ఉంటే నిర్ణయాధికారం ఎలా మారుతుందో ఆమె వివరించారు. కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు కాంగ్రెస్‌లో మహిళలకు అవకాశం అంటే అది కేవలం ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీ వంటి ఒకే కుటుంబానికి పరిమితమని విమర్శించారు. దేశంలోని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళలలో సీట్లు పెంచే ప్రతిపాదనను అడ్డుకోవడం ద్వారా ఇండియా కూటమి దక్షిణ భారతాన్ని మోసం చేసిందని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్విభజన వల్ల తెలంగాణలో ఎంపీ సీట్లు 17 నుండి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38కి పెరుగుతాయని, ఈ ప్రయోజనాన్ని ఇండీ కూటమి అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకత్వం గురించి మాట్లాడుతూ, ఆ పార్టీలో కేవలం 'ఖాన్దాన్' (వారసత్వ) రాజకీయాలే నడుస్తాయని, జార్కిహోళి కుమార్తెకు టికెట్ ఇవ్వడాన్ని ఆమె ఉదహరించారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో తనను తాను 'జాదూగర్' (మాంత్రికుడు) అని సంబోధించుకుంటూ అపరిపక్వంగా ప్రవర్తించారని ఆమె విమర్శించారు. సిఎంపై నిప్పులు చెరిగిన శోభ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై, ప్రజలకు చేసిన అన్యాయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె నిప్పులు చెరిగారు. గత ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్ల పెంపు, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం వంటి ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. చివరగా తెలంగాణ ముఖ్యమంత్రి కేవలం హైకమాండ్‌ను సంతోషపెట్టడానికే ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, హామీల అమలులో విఫలమై రాష్ట్ర ప్రజలను 'పిక్ పాకెట్' చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎంపీ డికె అరుణ పాల్గొన్నారు.

# ఉద్యమకారులంతా ఒక్కతాటిపైకి రావాలి

**హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** ప్రజలకు సేవ చేసేందుకు అడ్డంకిగా ఉన్న బూర్జువా పార్టీలను వదిలేసి కొత్త రాజకీయ శక్తిగా రాబోతున్న జాగృతిలో చేరాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులు జాగృతి పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన నాయకులంతా ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి కోసం ఒక్కతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కొత్త పార్టీలో చేరడానికి అన్ని జిల్లాల నుంచి నాయకులు ముందుకు వస్తున్నారని చెప్పారు. బోథ్ మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ బాపూరావు ఆదివారం తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. కల్వకుంట్ల కవిత ఆయనకు కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. 2007లో కుటుంబంతో సహా తాను బోథ్‌కు వెళ్లి అక్కడి ఆదివాసీలు, గిరిజనుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించానని గుర్తు చేసుకున్నారు. వాన పడితే ఆదివాసీ గూడాలు, మన్నెం జ్వర పీడితులతో నిండి ఉండేదని..

ఆ పరిస్థితి నుంచి మార్పు రావాలనే తెలంగాణ సాధించుకోవాలని అందరం ఐక్యంగా ఉద్యమించామని గుర్తు చేశారు. ఏ స్పిరిట్ తో రాష్ట్ర సాధన కోసం ఉద్యమించామో ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అదే స్ఫూర్తితో పని చేయాల్సి ఉందన్నారు. రాథోడ్ బాపూరావు ఉద్యోగాన్ని వదులుకుని తెలంగాణ ఉద్యమంలో పని చేశారని చెప్పారు. ఆయన తెలంగాణ జాగృతి నుంచే బిఆర్ఎస్‌లో చేరి రెండు సార్లు ఎంఎల్ఎ అయ్యారని.. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త పార్టీకి ఆదరణ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా నుంచి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సహా పలువురు నాయకులు జాగృతిలో చేరారని అన్నారు. ఆదివాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి జనగణనలో ఆదావాసీల మతం కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆదివాసీ కాన్‌స్టిట్యూషన్ రైట్స్ అండ్ కల్చరల్ ప్రొటెక్షన్ జెఎసి జాతీయ అధ్యక్షుడు, ఖమ్మం జెడ్‌పి మాజీ చైర్మన్, మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో జెఎసి నాయకులు ఆదివారం జాగృతి కార్యాలయంలో కవితతో భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలతో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను చందా లింగయ్య దొర ఈ సందర్భంగా వివరించారు. కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పెసా చట్టానికి తూట్లు పొడుస్తూ ఆదివాసీల హక్కులను హరిస్తోందని అన్నారు. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో ఆదివాసీలకు ఉన్న రక్షణలను తొలగిస్తోందని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో వడగండ్ల వాన ..

(మొదటి పేజీ తరువాయి)

వర్షం కురిసింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్లోని వివిధ ప్రాంతాల్లో వడగండ్ల వాన కురుస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట్, జేఎన్‌టీయూ , నిజాంపేట్, కేపీహెచ్‌బీకాలనీ, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం అకస్మాత్తుగా వడగళ్ల వాన కురిసింది. వేడి వాతావరణం కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా గాలివానతో పాటు వడగళ్ల వర్షం పడటంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వర్షం కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వానలు సంభవిస్తున్నాయని, వచ్చే కొన్ని గంటలు కూడా ఇలాంటి పరిస్థితులు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతల్, పద్మనగర్‌లో గాలి వాన ధాటికి వేర్లతో సహా భారీ వృక్షం కూలింది. చెట్టు దాటికి రెండు కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో రహదారులపైకి వాన నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసరాల్లోనూ భారీవర్షమే పడింది. కొన్నాళ్లుగా భానుడి భగభగలతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఉక్కపోతతో నగర ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడి ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు స్వాంతన పొందారు.

# రేవంత్ మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ : హరీష్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువ..చేతలకు తక్కువని ఎద్దేవా చేశారు. ఎస్ఎల్ బిసిలో మృతదేహాలను బయటకు తీయని దద్దమ్మ రేవంత్ రెడ్డి ప్రభుత్వమని, రైతుబంధు రూ.15 వేలు, బోనస్ ఇస్తామన్నారని ఇచ్చారా? అని ప్రశ్నించారు. రైతు డిక్లరేషన్ పై రాహుల్ గాంధీ పెదవి మూసుకున్నారని, రుణమాఫీపై మొదటి సంతకం అన్నారని.. దేవుళ్లపై భద్రాద్రి రాములు, యాదాద్రి లక్ష్మినర్సింహ స్వామి, మెదక్ చర్చిలపై ఒట్టు పెట్టారని మండిపడ్డారు. వంద రోజుల్లో రుణమాపీ చేస్తామని చెప్పారని, బ్యాంకుల అకౌంట్లు విలీనం కాకుండా రైతులకు రుణమాఫీలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మి డబ్బులు కట్టి మోసపోయారని, అసెంబ్లీలో రుణమాఫీపై నిలదీస్తే అయిందని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ వచ్చాక 4 రైతుబంధు వచ్చాయని..ఒక్క రైతుబంధే వేశారని.. రెండు విడతల రైతుబంధు ఎగ్గొట్టారని, గత యాసంగికి ఇవ్వలేదని హరీష్ రావు దుయ్యబట్టారు.

# కేసుల భయంతో బానిసలా బతుకాలా..?..

## - సోదరుడు జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు



**అమరావతి,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్‌ఎస్‌ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు. అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్‌డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు.

# జలధార కింద అన్ని ఆలయాల పుష్కరిణిల్లో నీరు నింపాలి: చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పుష్కరిణిల్లో నీరు నింపాలని, అర్బన్ మండలాల్లో నోడల్ అధికారులుపర్యవేక్షించాలని చంద్రబాబు సూచించారు. నీటి సంరక్షణలో అన్నయ్య జిల్లా మోడల్ ప్రతిచోటా అమలు కావాలని, జలధార-జలహారతిలో ప్రజలను భాగస్వాములు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు.

# నేడే కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ..

(మొదటి పేజీ తరువాయి)

భారీ ర్యాలీగా కేసీఆర్ సభా ప్రాంగణానికి వెళ్తారు. అనంతరం జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తారు.

# తుది ఒప్పందానికి బహుదూరం

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పదేపదే విశ్వాస ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటూ శనివారం హొర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి ముందు హొర్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణించడానికి నౌకలు రుసుము చెల్లించాలని ఇరాన్ ఒత్తిడి చేసింది. రుసుము చెల్లించే నౌకలకు చెల్లించని వాటి కంటే ప్రాధాన్యత ఉంటుందని ఒక సీనియర్ ఇరాన్ అధికారి సీఎన్‌ఎన్‌కి తెలిపారు. ఈ చర్య అమెరికాతో చర్చలను క్లిష్టతరం చేసినప్పటికీ హొర్ముజ్ జలసంధిలోని పరిస్థితిని ఘాలిబాఫ్ ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక విజయంగా అభివర్ణించారు. శత్రువును మేము నాశనం చేయలేదు. వారి వద్ద ఇప్పటికీ డబ్బు, ఆయుధాలు ఉన్నాయి. కాని వ్యూహాత్మకంగా మా చేతిలో వారు ఓటమి పాలయ్యారు అని ఘాలిబాఫ్ వ్యాఖ్యానించారు. చర్చలు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన విభేదాలు ఇంకా పరిష్కారం కాలేదని, అందువల్ల ఏదైనా పురోగతి సాధించడానికి ఇంకా చాలా సమయం పడుతుందని ఆయన సూచించారు. చర్చల్లో చాలా అంతరాలు ఉన్నాయని, తుది షరతులపై చర్చించే దశకు ఇరు పక్షాలు ఇంకా చేరుకోలేదని ఆయన చెప్పారు. **మా అణు హక్కులను కాదనడానికి ట్రంప్ ఎవరు?** ఇరాన్ అణు హక్కులను నిరాకరించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అదివారం స్పష్టం చేశారు. సమీపిస్తున్న కాల్పుల విరమణ గడువుకు ముందు అమెరికా, ఇరాన్ మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మేం అణు హక్కులను వినియోగించుకోకూడదని ట్రంప్ ఆదేశిస్తున్నారు. అది ఏ నేరానికి అనేది చెప్పడం లేదు. ఒక దేశం హక్కులను హరించడానికి ఆయన ఎవరు? అని జెష్కియన్ అన్నట్లు ఐఎస్ఎన్ఏ వార్తా సంస్థ పేర్కొంది.

# వైఫల్యం మీదే.. దిగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించని ఆ పార్టీ అధికారంలోంచి దిగిపోవాలని వారు డిమాండ్ చేశారు. గత 12 ఏండ్లుగా చెప్పుకోదగ్గదేమీ సాధించలేక, నిరాశ నిస్పృహలకు లోనైన మోదీ జాతిని ఉద్దేశించి చేసే అధికారిక ప్రసంగాన్ని బురద జల్లుడు, పచ్చి అబద్ధాలతో నిండిన రాజకీయ ప్రసంగంగా మార్చారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. తృణమూల్ అధినాయకురాలు, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) ప్రక్రియ, మహిళా రిజర్వేషన్లపై ప్రధాని ప్రజలను తప్పుదోప పట్టించారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును లోక్‌సభలో ఆమోదింపచేయడంలో విఫలమైన కారణంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించలేదనే విషయం స్పష్టమైందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. అందువల్ల కేంద్రంలో అధికారంలో కొనసాగే హక్కు ఆ కూటమికి లేదన్నారు. ప్రధాని తన ప్రసంగం ద్వారా అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని సీపీఐ ఎంపీ పీ సంతోష్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆదివారం లేఖ రాశారు. దీనిపై ఈసీఐ వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. దూరదర్శన్, సంసద్ టీవీ వంటి ప్రజా వేదికలపై ఆ ప్రసంగాన్ని ప్రసారం చేయడం ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి పాల్పడడమేనని ఆయన ఆరోపించారు.

# బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

**విరుధునగర్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి):** తమిళనాడులోని విరుధునగర్ జిల్లా కట్టనర్‌పట్టి గ్రామంలో ఆదివారం ఓ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి 18 మంది మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. ఫ్యాక్టరీ లోపల ఫ్యాన్సీ టపాసులకు గొలుసులు అతికించడంలో 30 మంది కార్మికులు నిమగ్నమై ఉన్న సమయంలో ఈ పేలుడు సంభవించినట్లు తెలిసింది. పేలుడు ధాటికి భవనంలో కొంత భాగం కూలిపోయింది. గోవిందపల్లూరుకు చెందిన ముత్తు మాణిక్కం అనే వ్యక్తి ఈ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పేలుడుతో ఆ ప్రాంతంలో భయాందోళన నెలకొన్నది. సహాయక చర్యల కోసం అత్యవసర బృందాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. క్షతగాత్రులను వెంటనే విరుధునగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కాగా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# నేను కోలుకుంటున్నా.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు : పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారని చిరంజీవి చెప్పారు. వైద్యుల సూచన మేరకు సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చునని తెలిపారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 'మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు' అని చెప్పారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను' అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారని పేర్కొన్నారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దామని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. దీనికి పవన్ స్పందిస్తూ.. నా ఆరోగ్యం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ.. నేను క్రమంగా కోలుకుంటున్నా అని పేర్కొంటున్నారు. మీ ఆదరణకు కృతజ్ఞుడను అని బదులిచ్చారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలని తమ సందేశాల్లో పేర్కొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
సోమవారం 20 ఏప్రిల్ 2026



# హ్యాపీ బర్త్ డే బాబు గారూ..

## అసాధారణ రాజకీయ దురంధరుడు..

## అలుపెరగని నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

### తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కితాబు

### చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆయన సేవలకు సెల్యూట్


### గుర్తుకొస్తున్నాయి అంటూ.. "బాబు" ఆశయాల జ్ఞాపకాల అడుగు జాడల్లో పయనం..

### ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి పనుల పర్యవేక్షణ

### నేటి యువత చంద్రబాబును గుర్తుంచుకోవాలన్నదే లక్ష్యం..


### తెలంగాణ ప్రాంతానికి బాబు చేసిన సేవలు అద్భుతమైనవనీ ప్రశంస

**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రాజకీయ వ్యూహాలు, మొక్కవోని దీక్ష, భవిష్యత్‌పై పక్కా ప్రణాళిక, తెలుగు రాష్ట్రలను ముందువరుసలో నిలపాలన్న ప్రత్యేక విజన్.. అభివృద్ధి కాముకుడు..! అలుపెరగని నాయకుడు..! పడిన ప్రతిసారీ ఉవ్వెత్తున ఎగిసే కెరటం.. నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితం ఆద్యంతం సంఘర్షణల మయం.. అయినా ఆయనను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాయి.. ఆయన మరెవరో కాదు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.నేడు ఆయన 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయుడి విజయ గాథలను మీడియాకు వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన పురస్కరించుకొని గత వారం రోజులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష నేతగా ఆయన చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఇంకా ఆయన చేపట్టిన పాదయాత్ర తదితర విషయాలకు సంబంధించిన ప్రాంతాలను మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సందర్శించి కార్యకర్తలను తరదైన శైలిలో చైతన్య పరుస్తున్నారు. నారా చంద్రబాబు నాయుడు జన్మదినని పురస్కరించుకొని ఇప్పటికే జిల్లాలోని కమ్మదనం అటవీ క్షేత్రంలో అనాటి ప్రపంచ అధ్యక్షుడు ఉల్ఫెన్ సన్ సందర్శించిన అడుగుజాడలను మళ్లీ ఒకసారి కార్యకర్తలతో కలిసి సందర్శించారు. కమ్మదనం గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సేవలను కొని అడుగులని సందర్శించి విద్యార్థులతో బాబు ఆశయాలను పంచుకున్నారు. అంతేకాదు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మూసాపేటలో గల రిసోర్స్ సెంటర్ ను సందర్శించారు. జోగులాంబ దేవాలయంలో ఆనాడు చంద్రబాబు హయాంలో నిర్మించిన గ్రూప్ టెంపుల్స్ పథకం కింద నిర్మించిన కట్టడాలను సందర్శించారు. మెదక్ జిల్లాలో పెద్దిరెడ్డిపేట ఆలయాన్ని సందర్శించి ఆనాటి కుల వివక్షతపై పోరాడిన తీరును స్థానికులకు వివరించారు. నల్గొండ జిల్లా భువనగిరిలో ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రామానంద తీర్థ గ్రామీణ గ్రామీణ పరిశ్రమను సందర్శించి స్థానిక నాయకులలో ఉత్సాహం నింపారు. అదేవిధంగా భూథాన్ పోచంపల్లిలో వినోబాభావే కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.. అంతే కాకుండా వారి సేవలను కొనియాడుతూ టూరిజం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా వట్టెం గ్రామంలో ఆనాడు బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ సందర్శించిన ప్రాంతాన్ని బక్కని నరసింహులు మళ్ళీ సందర్శించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఆయన విజన్ దూర దృష్టిని నేటి యువతకు మీడియా ద్వారా విశదికరించారు. ముఖ్యంగా ఆనాడు పాలమూరు జిల్లాలో ప్రతిపక్ష హోదాలో 2012 లో అక్టోబర్ 22వ తేదీన పాదయాత్ర ద్వారా జిల్లాలో ప్రవేశించారు.

జిల్లాలో 16 రోజుల్లో 199 కిలోమీటర్లు పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా ఆనాడు రంగారెడ్డి మెదక్,ఖమ్మం, వరంగల్,నల్గొండ, కరీంనగర్ తదితర జిల్లాలలో 1353 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్రకు సంబంధించి కూడా అనేక విషయాలను మీడియాతో పంచుకున్నారు.




### భవిష్యత్తుపై పక్క ప్రణాళిక ఉన్న నేత చంద్రబాబు

### -బక్కని నరసింహులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలకు కొత్త తరహా పాలనను పరిచయం చేశారనీ శ్రమదానం,ప్రజల వద్దకు పాలన, జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత, గ్రామీణ మహిళల ఆర్థిక అభ్యున్నతికి డ్వాక్రాసంఘాల ఏర్పాటు, రైతుబజార్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారనీ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినము సందర్భంగా షాద్ నగర్ లో బక్కని నర్సింహులు మీడియాకు పలు విషయాలు వివరించారు. నారా చంద్రబాబు నాయుడు స్థాపించిన స్వయం సహాయక సంఘాలు గ్రామీణ పేద మహిళల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాయనీ డ్వాక్రా సంఘాల విజయ గాథలు తెలుసుకోవడానికి దేశ,విదేశీ ప్రముఖులు రాష్ట్రాన్ని సందర్శించారన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆనాడు సాధించిన మహిళా ఆర్థిక స్వావలంబన గురించి బ్రిటన్ పార్లమెంటులో ప్రత్యేకంగా ప్రస్తావించారనీ 'పనిచేసే ముఖ్యమంత్రి' అన్న పేరు చాలా త్వరగా వచ్చిందన్నారు. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడ్డ పాలమూరు జిల్లాలో షాద్ నగర్ కు ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు ఉల్ఫెన్ సన్,అదేవిధంగా ప్రభుత్వ వైద్యశాలకు బిల్ క్లింటన్, అదేవిధంగా ఆనాటి ఉమ్మడి జిల్లాలోని వట్టెం గ్రామానికి టోనీ బ్లేయర్ దంపతులు కూడా అభివృద్ధి కోసం ఈ ప్రాంతానికి తీసుకువచ్చిన చరిత్ర చంద్రబాబుదని అన్నారు.





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వనదేవతల ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

## మహాద్భుతంగా ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలి -రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**ములుగు,(ప్రజావినికిడి):**
మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల పునర్నిర్మాణ అభివృద్ధి చివరి దశ పనులలో వేగం పెంచి, వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తుల కోసం మహాద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు.
ఆదివారం ములుగు జిల్లా ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా,స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, అశ్వాపురం శాసనసభ్యులు జారే ఆదినారాయణ లతో కలిసి దర్శించుకున్నారు.
మంత్రులు, ఎమ్మెల్యేలు మేడారం చేరుకొని, సమ్మక్క-సారలమ్మవనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.
అనంతరం మేడారం హరిత హోటల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.చివరి దశలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని గూర్చి మంత్రులకు, ఎమ్మెల్యేలకు కూలంకషంగా వివరించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో, గుత్తేదారులతో చివరి దశ అభివృద్ధి పనులపై పలు అంశాలను చర్చించి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా మంత్రి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఆలయ ప్రాంగణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరైన అన్ని ప్రధాన ఆర్చీల పనులను వేగంగా పూర్తి చేయాలని, సారలమ్మ పూజారుల కోరిక మేరకు క్యూలైన్ పక్కనే ప్రత్యేకంగా సారలమ్మ ప్రధాన ఆర్చీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి అందించాలని పేర్కొన్నారు.
గుడికి సంబంధించిన రాతి నిర్మాణాలలో ఎక్కడా చిన్న ఖాళీలు కూడా లేకుండా అత్యంత పటిష్టంగా ఉండేలా చూడాలని,గద్దెల ప్రాంగణంలో ఎత్తు పల్లాలు లేకుండా ఫ్లోరింగ్ సరిచేయాలని, గద్దెల రైలింగ్, ఆలయ డ్రైనేజీలలో ఎక్కడ చుక్క నీరు నిలవకుండా చూడాలని, ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రధాన రహదారి డ్రైనేజీకి లింక్ చేసే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.
ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రధాన రహదారికి ఇరువైపులా శుభ్రం చేస్తూ మొక్కలను నాటాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.
వనదేవతల ప్రాంగణంలో భక్తులకు మెరుగైన సేవలందించేందుకు,నిర్వహణ కోసం మొత్తం అవసరమైన సిబ్బంది ప్రతిపాదనలను సిద్ధం చేయాలని తెలిపారు.అభివృద్ధి పనులలో ఫేజ్-2లో భాగంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టవలసిన అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి మల్లూరు దేవాలయాన్ని కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేసి,వచ్చే భక్తులకు అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు లోటుపాట్లు కలగకుండా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే విధంగా ఆలయ ప్రాంగణం ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.
అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. మీడియాతో మాట్లాడుతూ, మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణంలో మిగిలిన చివరి దశ పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు.
స్థానిక పూజారి కుటుంబానికి చెందిన బాలుడికి దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాదం చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు.ఈ సంఘటనపై వెంటనే స్థానిక మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని బాలుడికి మెరుగైన వైద్యం అందించడం జరిగిందని,దానికి సంబంధించిన ప్రతి రూపాయి ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించిందని స్పష్టం చేశారు.
భవిష్యత్తులో బాలుడికి,బాలుడి కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని, కాలుకు సంబంధించి మెరుగైన టెక్నాలజీ ద్వారా కృత్రిమ కాలును ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారని తెలిపారు.
అనంతరం మండలం లోని నార్లపూర్ గ్రామంలో ఆవుల లక్ష్మి రాజు దంపతులకు చెందిన ఇందిరమ్మ గృహం ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలసి ప్రారంభించారు.
ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్,ఏఎస్పీ మనన్ భట్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఏ పి ఓ వసంతరావు, ఆర్డీఓ వెంకటేష్, మేడారం సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# ఎకోరైజ్ ప్రాజెక్టును ప్రారంభించిన శ్రీ చిన జీయర్ స్వామి

## శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ప్రారంభం -అందరికీ అందుబాటులో నాణ్యమైన సదుపాయాలు





**రాజేంద్రనగర్,(ప్రజావినికిడి):**
భాగ్య నగరంలోని రాజేంద్రనగర్‌లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్' ప్రతిష్టాత్మక నివాస ప్రాజెక్ట్ 'ఎకోరైజ్'కు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. పరమపూజ్యులు శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య సమక్షంలో వారి మంగళాశాసనాలతో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ చినజీయర్ స్వామి మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ మంచి ఇల్లు కోరుకుంటారు. కానీ నిజమైన ప్రశాంతత మనస్సులోనుంచే రావాలి.ఆ ప్రశాంతతను కలిగించే వాతావరణం కలిగిన ఇళ్లు నిర్మించడమే ముఖ్యం" అని పేర్కొన్నారు.నేడు పరశు రామ జయంతి,రేపు అక్షయ తృతీయ ఇంతటి పుణ్యదినాల్లో ఇలాంటి శుభకార్యాన్ని ప్రారంభించడం శ్రేయస్కరమని ఆశీర్వదించారు. అనంతరం నిర్వాహకులు ప్రాజెక్టు గురించి వివరించారు. ప్రకృతి సౌందర్యం, ఆధునిక సౌకర్యాల సమ్మిళితంగా రూపుదిద్దుకుంటున్న ఈ 'ఎకోరైజ్' ప్రాజెక్ట్ ఆకర్షణీయంగా నిలుస్తోంది. సుమారు 5.24 ఎకరాల విస్తీర్ణంలో, కేవలం 516 యూనిట్లతో తక్కువ జనసాంద్రతతో ప్రణాళిక రూపొందించారు. 100 శాతం వాస్తు ప్రమాణాలతో 3,4 బీహెచ్‌కే ఫ్లాట్లు 2,250 నుంచి 4,695 చదరపు అడుగుల విస్తీర్ణంలో అందుబాటులో ఉన్నాయి. ప్రాజెక్ట్‌లో పచ్చదనానికి పెద్దపీట వేస్తూ 1.2 ఎకరాల్లో ల్యాండ్‌స్కేపింగ్, 33,000 చదరపు అడుగుల 'స్కై గార్డెన్స్' ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా 57,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ++7 అంతస్తులతో గ్రాండ్ క్లబ్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో ఉండటంతో గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ,శంషాబాద్ విమానాశ్రయాలకు సులభంగా చేరుకునే సౌలభ్యం ఉంది.సమీపంలో విద్యాసంస్థలు, ఆధునిక వైద్యశాలలు, జీఎంఆర్ బిజినెస్ పార్క్ ఉండటం ఈ ప్రాజెక్ట్‌కు మరింత బలం చేకూరుస్తోంది. అందరికీ అందుబాటులో ఉండేలా, నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.తక్కువ ఖర్చుతో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ,ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరింత విస్తరణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.దక్షిణ హైదరాబాద్‌లో నివాసాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, లాంచింగ్ సందర్భంగా పరిమిత కాలం పాటు ప్రత్యేక ధరలను అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాజేంద్రనగర్ కారిడార్‌లో ప్రీమియం గృహాలను సొంతం చేసుకోవాలనుకునే వారికి ఇది సువర్ణావకాశమని వారు పేర్కొన్నారు




# పెరిక బాలికల వసతి గృహం శంకుస్థాపన

**దిల్సుఖ్‌నగర్,(ప్రజావినికిడి):**
గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కమలనగర్ కాలనీ సాయిగార్డెన్స్ నందు నూతన పెరిక బాలికల వసతి గృహం శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు,మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రిసెప్షన్‌కు సీఎం రేవంత్.. నూతన దంపతులకు ఆశీస్సులు

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వివాహ రిసెప్షన్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ యువ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జగిత్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం ఇందుజ రెడ్డితో ఆయన వివాహం ఏప్రిల్ 11న గోవాలో జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుకను నిరాడంబరంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల కోసం తాజాగా వివాహ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై, నూతన దంపతులు వెంకట్, ఇందుజలతో కాసేపు ముచ్చటించారు. వారి భవిష్యత్ జీవితం ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందించారు. ఈ విందుకు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు కూడా హాజరై వధూవరులను





# హైదరాబాదులో ఈదురుగాలులు, వడగళ్ల వాన బీభత్సం

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
నగరంలో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఎండలు మండిపోగా, మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఆకాశం మేఘావృతమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల వడగళ్లు కూడా పడటంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.ఈదురు గాలుల ధాటికి చింతల్, పద్మనగర్ ప్రాంతాల్లో ఒక భారీ చెట్టు వేర్లతో సహా కూలిపోయింది. దీని ప్రభావంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ఘటనలో పలు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, సికింద్రాబాద్, జీడిమెట్ల, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట, బాలానగర్ సహా నగరంలోని అనేక ప్రాంతాల్లో వడగండ్ల వాన ప్రభావం చూపింది.



## కేసీఆర్ సభ అంటే.. రేవంత్‌కు వెన్నులో వణుకు పుడుతుంది: ఎర్రోళ్ల శ్రీనివాస్



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బాధ్యత కన్నా.. బీఆర్ఎస్ అంటేనే భయం ఎక్కువగా ఉందని మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. అందుకేనేమో సిద్దిపేట వచ్చే ముందు భయంతో రైతు భరోసా ప్రకటి ంచారని.. రేపు జరగబోయే జగిత్యాల సభ ముందు రెండో విడత రైతు భరోసా ప్రకటించారని తెలిపారు.తెలంగాణ సమాచా రంఇది రైతు భరోసా ప్రభుత్వం కాదని.. తెలంగాణ ప్రజలకు ఏ భరోసా, ఏ నమ్మకాన్ని ఇవ్వని ప్రభుత్వమని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ లేదని.. రాష్ట్ర ప్రజల పట్ల బాధ్యత లేదని విమర్శించారు. కానీ బీఆర్ఎస్ అంటే భయం.. కేసీఆర్ సభలు పెడితే వెన్నులో వణుకు ఉందన్నారు. ఇది బాధ్యతతో నడుపుతున్న ప్రభుత్వం కాదని.. బీఆర్ఎస్ పార్టీపై భయంతో నడుస్తున్న ప్రభు త్వమని విమర్శించారు. బాధ్యత లేని ప్రభు త్వానికి ప్రజలే స్పష్టంచేశారు.

# టికెట్ అక్కర్లేదు.. అందరికీ ఫ్రీ జర్నీ

హైదరాబాద్ :సిటీలో ప్రయాణమంటేనే ట్రాఫిక్ జాంలు, గంటల తరబడి నిరీక్షణ.. వీటన్నింటికీ ముగింపు పలికేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహి ళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సర్కార్, ఇప్పుడు ఎంఎంటీఎస్ రైళ్లలో మహి ళలు, పురుషులు సహా అందరికీ ఉచిత ప్రయా ణాన్ని అందించాలని నిర్ణయించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా జూన్ 2 నుంచి ఈ సరికొత్త పథకాన్ని పట్టాలెక్కించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ప్రస్తుతం ఎంఎంటీఎస్ ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు ఏడాదికి సుమారు రూ. 10 కోట్ల ఆదాయం



వస్తోంది. ఉచిత ప్రయాణ పథకం వల్ల రైల్వే నష్టపోకుండా ఉండేందుకు, ప్రయాణికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రస్తుతం వస్తున్న ఆదాయాన్ని తామే చెల్లిస్తా మని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వెళ్లిన ప్రతిపా దనలకు దక్షిణ మధ్య రైల్వే కూడా సాను కూలంగా స్పందించింది. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ఒప్పందం (వీశీఖ) కుదిరే అవకాశం ఉంది.ఆదరణ పెంచడమే లక్ష్యం. .ఒకప్పుడు నిత్యం లక్షకు పైగా ప్రయా ణికులతో కళకళలాడిన ఎంఎంటీఎస్, ప్రస్తు తం సరైన సమయపాలన లేక వెలవెల బోతోంది. ప్రస్తుతం కేవలం 40 వేల మంది లోపే ప్రయాణిస్తున్నట్లు అంచనా. ఈ నేపథ్య ంలో, ఉచిత ప్రయాణంతో పాటు మరిన్ని సం స్కరణలను ప్రభుత్వం సూచి ంచింది: ట్రిప్పుల పెంపు: రద్దీ సమయాల్లో రైళ్ల సంఖ్యను పెంచాలి.సమయపాలన: రైళ్లు నిర్ణీత సమయానికి నడిచేలా చర్యలు తీసుకోవాలి. కనెక్టివిటీ: రైల్వే స్టేషన్ల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు వీలుగా ఆర్టీసీ షటిల్ బస్సులను నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం స్టేషన్ ప్రాంగణాల్లో బస్సులకు స్థలం కేటాయించాలని రైల్వేను కోరింది.కీలక మలుపులో వీమీూ-2..ఉచిత ప్రయాణ ప్రతిపాదన బాగున్నప్పటికీ, ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 491.45 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని రైల్వే శాఖ గుర్తు చేసింది. ఈ బకాయిల చెల్లింపుతో పాటు ఉచిత ప్రయాణ పథకం అమలుపై స్పష్టత వస్తే, భాగ్యనగర ప్రజారవాణాలో కానుంది. యోచిస్తోంది.

# భవన నిర్మాణ రంగ కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి వివేక్..

సిద్దిపేట జిల్లా: భవన నిర్మాణ రంగం సహా అన్ని రంగాల కార్మికులను ఆదుకునేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ మేరకు తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్లు ఇచ్చేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.
సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లాకు భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. త్వరలోనే లేబర్ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రంగాల కార్మికులకు లేబర్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ప్రమాద బీమా అందేలా కార్యాచరణ సిద్ధం చేస్తామని వివేక్ భరోసా కల్పించారు.సింగరేణి కార్మికుల సంక్షేమానికి తన తండ్రి కాకా వెంకటస్వామి కృషి చేశారని మంత్రి వివేక్ చెప్పుకొచ్చారు. అప్పటి ప్రధాని పీవీ నరసింహారావుతో కొట్లాడి మరీ సింగరేణి




భూముల రక్షణ, కార్మికుల పెన్షన్లకు ఎంతో చేశారని పేర్కొన్నారు. కాకా వెంకటస్వామి మార్గంలోనే కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలనేది తన తపనంటూ చెప్పుకొచ్చారు మంత్రి. కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచామని.. గిగ్ వర్కర్స్ భద్రత కోసం చట్టాన్నీ అసెంబ్లీలో ప్రవేశపెట్టామని అన్నారు.హమాలీల సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు వివేక్. సిద్దిపేటలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం భవనానికి స్థల కేటాయింపుతోపాటు దాని నిర్మాణానికి మాట ఇస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు.

## సెలవులు ప్రారంభమైన తొలిరోజే ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి



మేడ్చల్ : మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. వేసవి సెలవులు వచ్చిన తొలిరోజే ఇద్దరి విద్యార్థులు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు .డబిల్‌పూర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టేందుకు గ్రామ పరిధిలోని ఇస్కాన్ టెంపుల్ సమీపంలో ఉన్న గుంతలో ఉన్న నీటిలో ఈత కొట్టేందుకు దిగారు.
నలుగురిలో ఇద్దరు లోతులోకి వెళ్లి నీట మునిగి మృతి చెందారు. మృతి చెందిన వారిలో 9వ తరగతి చదువుతున్న ఉమన్(14), ఏడవ తరగతి చదువుతున్న ఇర్ఫాన్(12)గా గుర్తిం చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీయించారు.

## తొర్రూర్ రంగనాథ ఆలయంలో మళ్లీ చోరీ.. మూడోసారి కూడా హుండీలు ఎత్తుకెళ్లిన దుండగులు



రంగారెడ్డి జిల్లా : హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు మరోసారి రెచ్చిపోయారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సొంత గ్రామమైన తొర్రూర్‌లో ఉన్న ప్రసిద్ధ రంగనాథ స్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లారు.
అర్ధరాత్రి సమయంలో ఆలయానికి చేరుకున్న గుర్తుతెలియని దుండగులు, దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భాలయం వద్ద ఉన్న రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు.. తలుపులు విరగొట్టి ఉండటం చూసి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆలయానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారా లుసేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆలయ ంలోని, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని క్షుణ్ణ ంగా పరిశీలిస్తున్నారు.ఈ ఆలయంలో దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస చోరీలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోలీసుల నిర్లక్ష్యం వల్లే దుండగులు పదే పదే రంగనాథ ఆల యాన్ని టార్గెట్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ఇప్ప టికైనా పటిష్టమైన బందోబస్తు నిర్వహి ంచాలని సూచిస్తున్నారు.

# ఏంటీ.. హైదరాబాద్ లోని ఈ ప్రాంతాల్లో ఇంటి అద్దె ఇంత చీపా..

హైదరాబాద్ : ప్రపంచంలోని మహా నగరాల్లో ప్రస్తుతం 68వ స్థానంలో ఉంది. సంపన్న నగరాల జాబితాలో 65 వ స్థానంలో కొనసాగుతోంది. ఇక స్టార్టప్ సంస్థలకు అనుకూ లమైన నగరాల్లో ప్రపంచంలోనే 19వ స్థానంలో ఉంది. హైదరాబాద్ మెట్రో పాలిటన్ సిటీగా అభివృద్ధి చెందింది. భాగ్యనగరంలో జనాభా రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. 2025 లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంత జనాభా కోటీ 13 లక్షల 30 వేలకు పైగానే ఉంది. 2024 తో పోలిస్తే 2.43 శాతం పెరుగుదల కనిపించింది. ఈ లెక్కన ఏటా దాదాపు 3 శాతం జనాభా పెరిగిపోతోంది.
ఉపాధి, ఉద్యోగం, చదువులు, కోచింగ్ లు, వ్యాపారం.. ఇలా అనేక పనుల కోసం నిత్యం వేలాది మంది ప్రజలు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారు. అయితే హైదరాబాద్ లో ఇంటి అద్దెలకు రెక్కలు వచ్చినట్లుగా పెరిగిపోతున్నాయి. భాగ్యనగరంలో రియల్ ఎస్టేట్ పెరిగిన నేపథ్యంలో ఇంటి అద్దెలు కూడా భారీగా పెరిగిపోయాయి. అయితే హైద రాబాద్ లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఇంటి అద్దెలు చాలా తక్కువగానే ఉన్నాయి.
హైదరాబాద్‌లో మీకు రూ. 3,000 నుండి మొదలుకొని 10వేలకు మంచి సౌకర్యాలతో ఇళ్లు లభించే ప్రాంతాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఓల్డ్ సిటీ, సంతోష్ నగర్ చంద్రాయణగుట్టతో పాటు చార్మినార్ చుట్టుపక్కల ప్రాంతాలు ఇప్పుడు హైదరాబాద్



లోనే అత్యంత సరసమైన ధరలలో ఇల్లు లభిస్తోంది. ఈ ప్రాంతాల్లో కేవలం రూ. 3,000 నుండి రూ. 7,000 మధ్యే అద్దెకు ఇల్లు లభిస్తోంది. అయితే ఈ ప్రాంతాల్లో కొంత నీటి కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఉప్పల్, మియాపూర్ , అమీర్‌పేట్ ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటాయి. ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో అద్దె ఇల్ల ధరలు సాధారణంగా రూ. 6,000 నుండి రూ. 10,000 మధ్య ఉంటాయి.అలాగే హైటెక్ సిటీకి సమీపంలో.. మియాపూర్ ప్రాంతంలో విశాలమైన 2దీఎఖ, 3దీఎఖ గృహాలు రూ. 8,000 నుండి రూ. 12,000 మధ్య లభ్యం అవుతున్నాయి. ఇక్కడి నుంచి ఐటీ హబ్ కేవలం 15-20 నిమిషాల ప్రయాణ దూరంలోనే ఉంది. ఇక అమీర్ పేట్ ప్రాంతంలో నెలవారీ అద్దెలు సాధారణంగా రూ. 4,000 నుండి రూ. 7,000 వరకు ఉంటాయి. అలాగే సికింద్రాబాద్ సమీపంలోని జుజు×ూ , కుషాయిగూడ ప్రాంతాల్లో అయితే ఇంటి అద్దెలు రూ. 10,000 నుండి రూ. 12,000 మధ్య ఉన్నట్లు సమాచారం.

## మహిళా రిజర్వేషన్ బిల్లు.. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల తూటాలు..

హనుమకొండ: లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసా గుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని వారికి ద్రోహం చేశారంటూ ఎన్డీయే నేతలు ఘాటుగా విమర్శిస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్ల పంపిణీలో అన్యాయం చేయాలని చూశారని ఇండి కూటమి నేతలు మండిపడుతున్నారు. మహిళా బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడంపైనా ఆగ్రహిస్తున్నారు. దీనిపై తెలంగాణలో నిరసనలు, ఆందోళనలతో ఈ వ్యవహారం రసవత్తరంగా మారింది.మహిళా రిజర్వేషన్లపై తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ కడియం కావ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాగరాజు, రాజేందర్ రెడ్డి తాజాగా స్పందించారు. ఈ అంశంపై బీజేపీ తీరును ఎండగడుతూ విమర్శలు గుప్పించారు. రాజ్యాంగానికి కమలం పార్టీ తూట్లు పొడుస్తోందని ఎంపీ కడియం కావ్య మండిపడ్డారు. ఆ పార్టీ నాయకులు ఆడవారిపై ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆగ్రహించారు. మహిళల పక్షపాతి కాంగ్రెస్ మాత్రమేనని, బీజేపీకి ఓటు అడిగే కనీస హక్కు లేదన్నారు.
మహిళా రిజర్వేషన్ బిల్లును ముందు పెట్టి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసే కుట్ర చేశారని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ ధ్వజమెత్తారు. ఆడవారిపై అఘా యిత్యాలను అరికట్టడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైందని అన్నారు. దేశ సమగ్రత దెబ్బ తీయటం కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని మేయర్ గుండు సుధారాణి ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ వ్యతిరేకమంటూ



దుష్ప్రచారం చేయటం సరికాదని హెచ్చరించారు. థర్డ్ క్లాస్ పార్టీ టికెట్లు, దొంగల ముఠాకు కేరాఫ్ బీజేపీ అంటూ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులెన్నో చెప్పాలని బీజేపీ నేతలను డిమాండ్ చేశారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ దొంగ నాటకాలు ఆడుతున్నారంటూ ఆయన విమర్శలు గుప్పించారు.మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై కుట్ర చేశారని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. వారి కుట్రలను ఇండి కూటమి తిప్పికొట్టిందని సంతోషం వ్యక్తం చేశారు. దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కాగా, ఈనెల 17న 131వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2/3 వంతు మెజారిటీ లేకపోవడంతో అది వీగిపోయింది. దీంతో డీలిమిటేషన్,
కేంద్ర పాలిత ప్రాంతాల
బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుంది.

## జీవన్ రెడ్డి బాటలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ నేతలు..మరో 25 మంది బీఆర్ఎస్‌లోకి



హైదరాబాద్ : బీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. కాంగ్రెస పాలనపై విసుగు చెందిన ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నా రు. తాజాగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంప ట్నం మండలం తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా గ్రామాలకు చెందిన 25 మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మాజీ వైస్ ఎంపీపీ నోమ ంల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లగులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గౌరవం లభిస్తుందన్నారు.

# హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

**అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు**

**9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు**

**మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ**

**ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు**



హైదరాబాద్,ఏప్రిల్ 19,(ప్రజావినికిడి): దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.
వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు.
ఇండస్ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**నంద్యాల, ఏప్రిల్ 19 :** ప్రజల జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురాగలిగే పీఎం సూర్య ఘర్ పథకం ప్రారంభించటం చాలా ఆనందంగా ఉందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా కోటి గృహాలకు ఉచిత విద్యుత్ అందించాలనే మహాత్తర లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు వంద శాతం సబ్సిడీతో ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈరోజు (ఆదివారం) బనగానపల్లె పంచమపేటలో ప్రధానమంత్రి సూర్యఘర్ ఉత్సవ్‌ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీతో సోలార్ ప్యానల్స్ అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇతర వర్గాలకు 40శాతం వరకు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 4606 మంది, బనగానపల్లె మండలంలో 2910 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. పంచమపేటలో 331 మంది లబ్ధిదారులకు ఈ పథకాన్ని అందిస్తున్నామని వెల్లడించారు.ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చని తెలిపారు. మధ్యతరగతి కుటుంబాలపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించవచ్చని అన్నారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రభుత్వానికి అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఈ పథకం కేవలం ఉచితంగా విద్యుత్‌ను అందించడం మాత్రమే కాదని... దేశాన్ని పునరుత్పాదక పేర్కొన్నారు.

## పల్నాడు జిల్లాలో దారుణం.. ఆరేళ్ల కుమారుడికి గడ్డి మందు తాగించిన తండ్రి..



**అమరావతి, ఏప్రిల్ 19:** పల్నాడు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబకలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఘాతుకానికి పాల్పడ్డాడు. కన్న కొడుకుకు గడ్డి మందు తాపాడు. ఆపై తను కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. భార్యకాపురానికి రావటం లేదన్న బాధతో ఆ వ్యక్తి ఈ దారుణమైన నిర్ణయం తీసుకున్నాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. బొల్లాపల్లి మండలం గంగుపల్లి తాండాకు చెందిన చిన్నా అనే వ్యక్తికి అదే ప్రాంతానికి చెందిన బుజ్జి అనే మహిళతో 7 ఏళ్ల క్రితం పెళ్లయింది.ఈ దంపతులకు 6 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మనస్పర్థల నేపథ్యంలో బుజ్జి పుట్టింటికి వెళ్లిపోయింది. చిన్నా ఎంత బ్రతిమలాడినా ఆమె మాత్రం కాపురానికి రాలేదు. దీంతో మనస్తాపం చెందిన అతడు దారుణానికి ఒడిగట్టాడు. కూల్ డ్రింక్‌లో గడ్డి మందు కలిపి కుమారుడికి ఇచ్చాడు. తర్వాత తను కూడా పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

## అమరావతి నిర్మాణంపై స్పందించిన విజయసాయి రెడ్డి.. రాజధాని నిర్మాణంపై పలు సూచనలు



**అమరావతి :** ఏపీ రాజధానిపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి మరోసారి స్పందించారు. అమరావతి నిర్మాణానికి పలు సూచనలు చేస్తూనే వైసీపీ ప్రతిపాదించిన మావిగన్ నమూనాపై విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో ఢిల్లీ నిర్మాణం తీరును ఆయన గుర్తు చేశారు. లక్షల కోట్ల అంచనాలతో అమరావతి ప్రణాళిక ఉందన్నారు. అప్పులపై ఆధారపడి క్యాపి టల్ సిటీని నిర్మించడం సరిద న్నారు. రాజధాని రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాజధానిని ఏకీకృత, దశల వారీగా నిర్మించాలని సూచించారు.

# కేసుల భయంతో బానిసలా బతుకాలా సోదరుడు జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు



**అమరావతి :** దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధిం చాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నిం చడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జ నసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు.అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుప డాలని షర్మిల అన్నారు. ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంట కాగాలా..? కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా..? బీజేపీ బిల్లులకు గొర్రెలా, గుడ్డిగా తలాడించాలా..? మోదీ మెప్పు కోసం సొంత కాకిలెక్కలు అల్లాలా..? అని నిలదీశారు. ఇదేనా తమరు చెప్పే వైఎస్ఆర్ ఆశయాలు, వారసత్వం..? అని ప్రశ్నించారు. మహానేత సిద్ధాంతాలను మంటగలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు ఆత్మవిమర్శ చేసుకోవాలి అన్నారు.రాజ్యాంగానికి విఘాతం కలిగించే అక్రమ బిల్లులకు విపక్షాలు అడ్డుపడి విజయం సాధిస్తే... ఏం సాధించారని ప్రశ్నించడం హాస్యాస్పదమని, కోట్లాది మంది రాష్ట్ర ప్రజల గుండెలు గాయపరచడమే మీ గొప్పతనమా అని నిలదీశారు.

## బంగాళాఖాతంపై ద్రోణి- ఏపీలో ఈ జిల్లాల్లో వర్షాలు



**అమరావతి :** ఏపీలో రోజురోజుకూ ఎండ తీవ్రత అధి కమౌతోంది. ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నడి వేసవి రాకముందే రోళ్లు పగి లేలా ఎండలు కాస్తోన్నాయి. ప్రజలు రోడ్ల మీ దికి రావాలంటే హడలిపోయే పరిస్థితి నెల కొంది. ఇది ఇప్పట్లో ఆగేలా కనిపించట్లేదు. ముమ్మందు ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదు. ఉపరితల ఆవర్తనం వల్ల మొన్నటివరకు వర్షాలు పడ్డాయి గానీ ఇప్పుడు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రత దిమ్మతిరిగేలా చేస్తోంది. రికార్డుస్థాయిలో టెంపరేచర్ నమోదవుతోంది. 40 డిగ్రీలకు పైగా ఎండ కాయడం సాధారణమైపోయింది. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు దాదాపు అన్ని ప్రాంతాల్లో కూడా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఈ ఎండలకు వడగాల్పులు తోడవుతున్నాయి. వేడి గాలులు మరింతగా జనాన్ని ఇబ్బందులకు గురి చేస్తోన్నాయి. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో వేడిగాలులు, ఉష్ణోగ్రత పంజా విసురుతున్నాయి.ఈ పరిస్థితుల మధ్య ఉత్తరాంధ్ర జిల్లాలకు తీపిక బురు అందింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో నేడు, రేపు కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ద్రోణి ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

# లోకేష్ కు విజయమ్మ- జగన్ కు పవన్ ఆప్తులైన వేళ..!



**అమరావతి :** ఏపీ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి, వైఎస్ జగన్, వైఎస్ షర్మిల తల్లి వైఎస్ విజయమ్మ పుట్టినరోజు ఇవాళ. ఈ సందర్భంగా ఆమెకు పలువురు హితులు, సన్నిహితులు శుభాకాంక్షలు చెప్తున్నారు. ఇదే క్రమంలో ఆమె పిల్లలు వైఎస్ జగన్ వైఎస్ షర్మిల కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్తారని అంతా ఆశిస్తారు. కానీ కూతురు వైఎస్ షర్మిల మాత్రమే విజయమ్మకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ జగన్ మాత్రం మౌనంగా ఉండిపోయారు.

ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన అమ్మకు 70వ పుట్టినరోజు శుభాకాంక్షలు! అంటూ వైఎస్ షర్మిల ఇవాళ తాను విజయమ్మతో ఉన్న ఫొటోను షేర్ చేస్తూ విషెస్ తెలిపారు. "నాకు నడవడం నేర్పించడం నుండి జీవితంలోని ప్రతి అడుగులో నన్ను ప్రోత్సహించడం వరకు, నువ్వే నా ఆధారం, నా మార్గదర్శి, నా బలం. నీ ప్రేమకు, జ్ఞానానికి, అంతులేని త్యాగాలకు ధన్యవాదాలు. ఈ కొత్త దశాబ్దం నీకు శాంతిని, ఆరోగ్యాన్ని, నీకు అవసరమైనంత ఆనందాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాను. ఈ రోజు, ప్రతి రోజూ నిన్ను వేడుక చేసుకుంటున్నాను. మాటల్లో చెప్పలేనంతగా నిన్ను ప్రేమిస్తున్నాను! దేవుడు నిన్ను దీవించుగాక అమ్మా!!" అని షర్మిల తెలిపారు.

మరోవైపు జగన్ శుభాకాంక్షలు చెప్పకపోయినా, ఆయన రాజకీయ ప్రత్యర్థి, మంత్రి నారా లోకేష్ విజయమ్మకు విషెస్ చెప్పారు. శ్రీమతి వై. ఎస్. విజయమ్మ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఈ శుభ సందర్భంలో ఆమె మంచి ఆరోగ్యం, ఆనందంతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాము అంటూ లోకేష్ ట్వీట్ లో పేర్కొన్నారు. అటు విజయమ్మ బర్త్ డేకు కనీసం ట్వీట్ లోనూ శుభాకాంక్షలు చెప్పని వైఎస్ జగన్ మాత్రం .. నిన్న సర్జరీ చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేశారు. దీంతో ఇప్పుడు లోకేష్ విజయమ్మకు పెట్టిన ట్వీట్, జగన్ పవన్ కు పెట్టిన ట్వీట్ తో పోలుస్తూ రాజకీయ పార్టీల కార్యకర్తలు వైరల్ చేస్తున్నారు.

# అమెరికా గడ్డపై రోజా కూతురు హిస్టరీ అత్యున్నత అవార్డ్





**అమరావతి :** మాజీ మంత్రి, నటి రోజా కుమార్తె అన్షుమాలిక తల్లికి మించిన తనయ అనిపించుకున్నారు. అమెరికాలోని ప్రముఖ ఇండియానా యూనివర్సిటీ చరిత్రలో అన్షు తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించింది. యూనివర్సిటీలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన "హెర్మన్ బి వెల్స్ డిస్టింగ్విష్డ్ సీనియర్ అవార్డు (2026)"ను ఆమె కైవసం చేసుకుంది. ఈ అద్భుతమైన వార్తను మాజీ మంత్రి రోజా సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ, తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అన్షుమాలిక ఇండియానా యూనివర్సిటీలోని లడ్డీ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మాటిక్స్, కంప్యూటింగ్ అండ్ ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ మేజర్‌గా చదువుతోంది. కేవలం చదువులోనే కాకుండా మ్యూజిక్ ప్రొడక్షన్, డేటా సైన్స్‌లో మైనర్ చదువుతూ తన బహుముఖ ప్రజ్ఞను చాటుతోంది.లీడర్‌షిప్ అవార్డు: 2025లో "మౌరీన్ బిగ్గర్స్ లీడర్‌షిప్ అవార్డ్ ఫర్ ఈక్విటీ అండ్ టెక్నాలజీ ఎక్సలెన్స్" అందుకుంది.అకాడెమిక్ ఎక్సలెన్స్: 2024–2025 సంవత్సరానికి "లడ్డీ అకాడెమిక్ ఎక్సలెన్స్ అవార్డు" కూడా పొందింది.ప్రతిష్టాత్మక స్కాలర్: "ఫౌండర్స్ స్కాలర్"గా గుర్తింపు పొం ది, ఎన్నో ప్రతిష్టాత్మక హానర్స్ సొసైటీలకు అధ్యక్షురాలిగా, కీలక బాధ్యతల్లో సేవలందించింది.ప్రపంచ వేదికపై సేవా దృక్పథం..అన్షు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాలేదు. గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్ అవార్డ్ (2024), గ్లోబల్ ఇంపాక్ట్ అడ్వకేట్ అవార్డ్ (2025) వంటి అంతర్జాతీయ గౌరవాలు ఆమెను వరించాయి. డొమినికన్ రిపబ్లిక్ మరియు పోర్చుగల్ దేశాలలో అంతర్జాతీయ సేవా కార్యక్రమాలకు సైట్ లీడర్‌గా నాయకత్వం వహించింది. ప్రస్తుతం ఐయూ కంప్యూటర్ విజన్ ల్యాబ్‌లో ప్రొఫెసర్ డేవిడ్ క్రాండల్ పర్యవేక్షణలో రీసెర్చ్ చేస్తోంది.సామాజిక బాధ్యతలోనూ అన్షు ముందే ఉంది. అనే లాభాపేక్షలేని గ్లోబల్ డిజిటల్ లిటరసీ మరియు ~~× ఎమ్పవర్‌మెంట్ సంస్థను స్థాపించి, ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోంది. దీనితో పాటు "పోడ్‌కాస్ట్‌కు ప్రొడ్యూసర్‌గా ఉంటూ మహిళా సాధికారతకు తన వంతు తోడ్పాటు అందిస్తోంది.

రోజా భావోద్వేగ సందేశం.."కలల నుంచి గెలుపు వరకు.. అన్షు ప్రయాణం మాకు ఎంతో గర్వకారణం. నీ కష్టం, అంకితభావం నిన్ను ఇక్కడికి చేర్చాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే. నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది" అంటూ రోజా ఎమోషనల్ పోస్ట్ చేశారు.అన్షు సాధించిన ఈ విజయం తెలుగు వారందరికీ గర్వకారణమని, విదేశాల్లో చదువుకుంటున్న ఎంతోమంది విద్యార్థులకు ఆమె ఒక స్ఫూర్తి అని నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## పవన్ కు ప్రధాని మోదీ ఫోన్ కాల్ ఆ నమ్మకం ఉంది



**అమరావతి :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు శస్త్రచికిత్స సైతం జరిగింది. కొంతకాలంగా శ్వాస సంబంధిత ఇ బ్బం దులతో సతమతవ ౌతున్నారు. ఇది మరి ంత తీవ్రం కావడంతో ఆసుపత్రిలో చేరారు. డాక్టర్లు ఆయనకు సర్జరీ చేశారు. ఇటీవలే వెలగపూడి సచివాలయంలో ఓ రివ్యూ మీటింగ్ లో పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే అన్ని అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని హైదరాబాద్ అపోలో హాస్పిటల్స్ కు అడ్మిట్ అయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్లు ఆయనకు స్కానింగ్ చేశారు. సర్జరీ అవసరమని నిర్ణయించారు. దీంతో శనివారం సాయ ంత్రం ఆపరేషన్ చేశారు. ఇది విజయవంతంగా ముగి సింది. సైనసైటిస్ ఉండటం వల్ల ముక్కుకు సర్జరీ చేశారని చెబుతున్నారు. ఇది అధికారికంగా తెలియరావాల్సి ఉంది. శస్త్రచికిత్స తర్వాత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకు ంటే సరిపోతుందని సూచించారు.పవన్ కల్యాణ్ సర్జరీకి సంబంధించిన తాజా సమా చారాన్ని ఆయన భార్య అన్నా లెజినోవా సోషల్ మీడియాలో పంచుకున్నారు. పవన్ కోలుకుంటున్నారని తెలిపారు. సర్జరీ నేపథ్యంలో పవన్ కల్యాణ్ కు పలువురు ప్రముఖులు ట్వీట్లు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పీడీ రికవరీని కోరుతూ ట్వీట్లు పోస్ట్ చేశారు. ఆయన మేనల్లుడు, ప్రముఖ నటుడు సాయిధరమ్ తేజ కూడా త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు. పవన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని కోరార .ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళాణ్ గారితో మాట్లాడి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నాను. ఆయన ఎంతో ధైర్య సాహసాలు కలిగిన వ్యక్తి. శ్రీ పవన్ కళ్యాణ్ గారు అతి త్వరలోనే కోలుకుంటారని నమ్ముతూ ఆయన సంపూర్ణ ఆరోగ్యం అదే నరేంద్ర స్పందించారు.

# అమరావతి, మావిగన్ రెండూ వేస్టే



**అమరావతి :** ఏపీ రాజధానిగా చంద్రబాబు అభివృద్ధి చేస్తున్న అమరావతి పాటు వైఎస్ జగన్ ప్రతి పాదిస్తున్న మావిగన్ కూడా పనికిరావని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తేల్చి చెప్పేశారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ రాజధాని అభివృద్ధి జరిగిన తీరును తెరపైకి తెచ్చారు. సుసం ఘటితమైన దార్శనికత, క్రమబద్ధమైన ప్రణా ళిక ద్వారా ఒక రాజధాని నగరాన్ని ఎలా అభి వృద్ధి చేయవచ్చో చెప్పడానికి న్యూఢిల్లీ ఉత్త మ ఉదాహరణలలో ఒకటిగా నిలుస్తు ందని సాయిరెడ్డి ట్వీట్ చేశారు.1911లో స్థాపించిన ఢిల్లీని నగరాన్ని ఎడ్విన్ లూటియన్స్, హెర్బర్ట్ బేకర్ రూపొందించారని, దీనిని సుమారు 42.7 చ.కి.మీ (10,550 ఎకరాలు) విస్తీర్ణంలో నిర్మించారని తెలిపారు. ఈ పరిమిత స్థలంలోనే, ఇది ప్రధాన ప్రభుత్వ కార్యకలాపాలు, రాష్ట్రపతి భవన్, పార్లమెంట్ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, అధికారిక నివా సాలను సమర్థవంతంగా ఇముడ్చుకుందన్నారు. 1931లో ?10 కోట్ల వ్య య ంతో ఇది పూర్తయిందన్నారు. ద్రవ్యోల్బణం, సాపేక్ష ఆర్థిక విలువను సర్దుబాటు చేసిన తర్వాత నేటి విలువలో దీని విలువ 10,000 కోట్లన్నారు. ఇటీవలి నగర అభివృద్ధి ప్రతిపా దనలతో పోలిస్తే ఈ వ్యయం చాలా తక్కు వగానే ఉందన్నారు.దీనికి విరుద్ధంగా, అమరావతిని దాదాపు 217 చ.కి.మీ విస్తీర్ణంలో, ?1-1.5 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించారని, ఇది ప్రధానంగా అప్పులపై ఆధారపడి ఉందని సాయిరెడ్డి తెలిపారు. ఇది ఆర్థిక వివేకం గురించిన ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తుతుందన్నారు. ఒక రాజధాని నగరానికి విస్తారమైన భూ నిల్వలు లేదా అధిక రుణభారంతో కూడిన ఆర్థిక సహాయం అవసరం లేదని, దీనికి లక్ష్య స్పష్టత, అవస రమైన సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడం, దశలవారీగా, స్థిరమైన వృద్ధి అవసరమన్నారు. ఈ సూత్రాన్ని అనుసరించడం ద్వారా ఏపీ ప్రయోజనం పొందుతుందని, తక్షణ దృష్టి ప్రధాన పరిపాలనా మౌలిక సదుపాయాలు, శాసనసభ, సచివాలయం, న్యాయవ్యవస్థ, అవసరమైన పరిపాలనా కార్యాలయాలు, అంతర్గత భద్రత, ఉండాలన్నారు.

## నాగబాబు కూడా తగులుకున్నాడు



**అమరావతి :** ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ చిక్కుల్లో పడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ఆయనకు పరువు నష్టం నోటీసు జారీ చేశారు. ప్రకాష్ రాజ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు హిందూ మనోభా వాలను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఈ నోటీసును పంపారు. ఇందులో పలు డిమాండ్లు ఉన్నాయి. వాటన్నింటినీ కూడా వారం రోజుల్లో ప్రకాష్ రాజ్ నెరవేర్చాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కేరళలో ఇటీవలే జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకాష్ రాజ్ సీతారామలక్ష్మణులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఉత్తరాదికి చెందిన రామలక్ష్మణులు దక్షిణాది రీజియన్ కు చెందిన లంకపై దండయాత్ర చేసినట్లుగా రామాయణాన్ని వక్రీకరించారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఇది ఇతిహాసాన్ని తీవ్రంగా వక్రీకరించడమేనని పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలపై తాజాగా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు స్పందించారు. షార్ప్ అటాక్ కు దిగారు. శ్రీరాముడు హిందువులకు దైవం మాత్రమే కాదని, ఆయన ధర్మానికి, నిత్య సత్యానికి, న్యాయానికి ప్రతిరూపమని పేర్కొ న్నారు. ఇటువంటి అహంకారపూరక మాటలు మాటాడేవాళ్లు, అజ్ఞానులు మాత్రమే శ్రీరాముడిని కించపర్చుతారని వ్యాఖ్యానించారు. అటువంటి వారు తమను తాము మాత్రమే నిందించుకున్నట్టవుతుందని చెప్పారు. "ధర్మం అవిచ్ఛిన్నమైనదని, దాని రక్షకులు అజేయులని నాగబాబు అన్నారు. ధర్మానికి శపించారు.

# CSK ను చూస్తే కడుపు తరక్కుపోతోంది - మరో స్టార్ బ్యాటర్ అవుట్



ఈ ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి అధ్వాన్నం. ఏదీ కలిసి రావట్లేదు. ఇప్పటికే ఆడిన ఆరు మ్యాచ్ లల్లో నాలుగింట్లో ఓడింది. నాలుగు పాయింట్లతో ఏడో స్థానంలో కొనసాగుతోంది. వరుసగా రెండు మ్యాచ్ లల్లో విజయాలు సాధించి గాడినపడిందనుకునే లోపే సన్ రైజర్స్ హైదరాబాద్ రూపంలో భారీ అడ్డంకి ఎదురొచ్చింది. దీన్ని అధిగమించలేక చతికలిపడిందా మోస్ట్ సక్సెస్ ఫుల్ టీమ్. అటు ధోనీ కూడా అందుబాటులో ఉండట్లేదు. అదిగో ఇదిగో అంటూ ప్రతి మ్యాచ్ కూ దాటవేస్తోన్నాడు.

ఈ పరిస్థితుల్లో చెన్నై సూపర్ కింగ్స్ కు మరో షాక్ తగిలింది. యంగ్ స్టార్ బ్యాటర్ ఆయుష్ మాత్రే జట్టుకు దూరం అయ్యాడు. చెన్నై జట్టులో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ ఇతనొక్కడే. హామ్‌స్ట్రింగ్ గాయంతో మూడు వారాల పాటు అందుబాటులో ఉండట్లేదు. శనివారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జరిగిన మ్యాచ్ సందర్భంగా మాత్రేకు గాయం అయింది. రన్ తీస్తుండగా గాయ పడ్డాడు. ఫిజియో టామీ సిమ్‌సెక్ చికిత్స తర్వాత కూడా అతను ఇబ్బంది పడ్డాడు. కనీసం సింగిల్ తీయలేకపోయాడు. తొంద రపాటు షాట్‌తో అవుట్ అయ్యాడు. తన సహచరుడు రామకృష్ణ ఘోష్, ఫిజియో సహాయంతో మైదానం వీడాడు. ఈ గాయం వల్ల మాత్రే కనీసం నాలుగు మ్యాచ్‌లకు దూరం కానున్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. 23న ముంబై ఇండియన్స్, 26న గుజరాత్ టైటాన్స్, మే 2న ముంబై ఇండియన్స్, 5న ఢిల్లీ కేపిటల్స్ తో మ్యాచ్ లకు అతను దాదాపుగా ఆడకపోవచ్చు. రేపు ముంబైలో అతనికి స్కాన్ చేయనున్నారు. గాయం తీవ్రత ఇంకా తెలియట్లేదు. మూడు వారాలు దూరంగా ఉంటాడని అంచనా. మే 10న లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌కు తిరిగి వస్తాడని అనుకోవడం కూడా తొందరపాటే అవ్వొచ్చు. గాయానికి ముందే ఆయుష్ మాత్రే హామ్‌స్ట్రింగ్‌కు బ్యాండేజీ కనిపించింది. దీంతో అతను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడాడు. మాత్రే గాయంపై హస్సీ మాట్లాడాడు. హామ్‌స్ట్రింగ్ ఇంజ్యూరీగా తేల్చాడు. స్కాన్ తర్వాతే దాని తీవ్రత తెలుస్తుందని చెప్పాడు. అతని గాయం వల్ల జట్టుకు నష్టమేనని, బెంచ్‌పై ఉన్న ఇతర ఆటగాళ్లకు అవకాశం వస్తుందని పేర్కొన్నాడు.

# మమ్మల్ని ముంచింది అదే- ఢిల్లీ మ్యాచ్ ఓటమిపై తేల్చేసిన ఆర్సీబీ..



బెంగళూరు చిన్న స్వామి స్టేడియంలో నిన్న ఢిల్లీ క్యాపిటల్స్ జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆరు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఆర్సీబీ విధించిన 176 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్ చివరి ఓవర్లో మరో బంతి మిగిలి ఉండగానే ఛేదించింది. అయితే ఈ మ్యాచ్ ను చివరి ఓవర్ వరకూ తీసుకురావడంలో సఫలమైన ఆర్సీబీ.. లాస్ట్ మినిట్ లో డేవిడ్ మిల్లర్ ను నియంత్రించలేక చేతులెత్తేసింది. అయితే ఆర్సీబీ టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం దీని వెనుక మరో కారణం చెబుతోంది. ఢిల్లీతో మ్యాచ్ లో ఎక్కువ భాగం ఆ జట్టును బాగానే కట్టడి చేసినప్పటికీ, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్ ఒక బంతి మిగిలి ఉండగా ఛేజింగ్‌ను పూర్తి చేయడంతో ఆ స్కోరు చాలా తక్కువని అర్థమైంది. ఈ నేపథ్యంలో సొంత గ్రౌండ్ లో తమ మొదటి ఓటమిపై స్పందిస్తూ.. ఆర్సీబీ క్రికెట్ డైరెక్టర్ మో బోబాట్.. జట్టు ఆటను అతిగా విశ్లేషించబోదని పేర్కొన్నారు. తాము పాజిటివ్ విషయాలను, ఇంకా మెరుగు పరుచుకోవాల్సిన అంశాలను ఎప్పుడూ పరిగణనలోకి తీసుకుంటామమన్నాడు. మొత్తంగా ఈ టోర్నీలో చాలా బాగా బ్యాటింగ్ చేస్తున్నామని, కాబట్టి ఈ మ్యాచ్ నుంచి కొన్ని పాఠాలు నేర్చుకుని, తర్వాతి మ్యాచ్‌లో తిరిగి మా సాధారణ ప్రయత్నిస్తామన్నాడు.

# జురెల్ కళ్లుచెదిరే స్టంపింగ్.. మరో ఓటమి దిశగా కోల్‌కతా



పంతొమ్మిదో సీజన్‌లో తొలి విజయం కోసం నిరీక్షిస్తున్న కోల్‌కతాను టాపార్డర్ బ్యాటర్లు మళ్లీ ముంచేశారు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ టిమ్ సీఫర్ట్(0)ను ఆర్చర్ బౌల్డ్ చేయగా.. బర్గర్ ఓవర్లో ఫామ్‌లో లేని అజింక్యా రహానే(0) ఔటయ్యాడు. క్రీజులో కుదురుకున్నట్టే అనిపించిన కామెరూన్ గ్రీన్(27)ను ధ్రువ్ జురెల్ అద్భుతంగా స్టంపౌట్ చేయడంతో కోల్‌కతా మూడో వికెట్ కోల్పోయింది. సొంత గడ్డపై ఏ జట్టైనా చెలరేగిపోతుంది. కానీ, కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం చతికిలపడుతోంది. వరుణ్ చక్రవర్తి(3-14), కార్తిక్ త్యాగీ(3-22)ల ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్‌ను 155కే కట్టడి చేసిన కోల్‌కతా బ్యాటింగ్‌లో తడబాటును కొనసాగించింది. ఆర్చర్ సంధించిన మొదటి బంతికే సీఫర్ట్(0) బౌల్డయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లో అజింక్యా రహానే(0)ను బర్గర్ వెనక్కి పంపాడు. ఓపెనర్లు డకౌటైన వేళ ఇంప్యాక్ట్ సబ్ రఘువంశీ(10 నాటౌట్) జతగా కామెరూన్ గ్రీన్(27) ధనాధన్ ఆడాడు. బౌండరీలతో స్కోర్ బోర్డును ఉరికిస్తున్న గ్రీన్‌ను బిష్ణోయ్ బోల్తా కొట్టించాడు. వైడ్ బాల్ ఆడబోయిన గ్రీన్‌ను.. జురెల్ రెప్పపాటులో స్టంపింగ్ చేశాడు.

# 'చేతబడిపై చర్యలు తీసుకోండి': బీసీసీఐకి సీఎస్కే ఫిర్యాదు




ఐపీఎల్ 2026లో భాగంగా శనివారం సీఎస్కే, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం సోషల్ మీడియాలో ఓ వింత చర్చ మొదలైంది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ విజయం సాధించిన తర్వాత సీఎస్కే ఓటమికి "చేతబడి" కారణమంటూ కొందరు సృష్టించిన ఫేక్ లెటర్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. నిమ్మకాయల మాయా జాలం.. మీమ్స్ వెల్లువ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఓ వింత దృశ్యం కెమెరా కంటికి చిక్కింది. సీఎస్కే బ్యాటర్ శివమ్ దూబే క్రీజులో ఉన్న సమయంలో గ్యాలరీలోని ఓ సన్‌రైజర్స్ అభిమాని నిమ్మకాయను చేతిలో పట్టుకుని తిప్పుతూ ఏదో మంత్రాలు చదువుతున్నట్లు కనిపించాడు. సరిగ్గా అదే సమయంలో శివమ్ దూబే ఔటవ్వడం యాదృచ్ఛికంగా జరిగినా.. నెటిజన్లు మాత్రం దీనిని "చేతబడి" అంటూ మీమ్స్‌తో హోరెత్తించారు. ఈ మీమ్స్ రచ్చ అలా కొనసాగుతుండగానే.. కొందరు ఆకతాయిలు ఒక అడుగు ముందుకు వేసి ఏకంగా ఒక ఫేక్ లెటర్ సృష్టించారు. చెన్నై సూపర్ కింగ్స్ సీఈఓ కాశీ విశ్వనాథన్ సంతకంతో ఉన్నట్లుగా భ్రమ కలిగించేలా ఆ లెటర్ ఉంది. "సన్‌రైజర్స్ అభిమానులు చేసిన చేతబడి, క్షుద్ర పూజల వల్లే మా ప్లేయర్లు ఫామ్ కోల్పోయి వింతగా ఔట్ అయ్యారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి" అని అందులో రాసి ఉంది. అయితే ఈ లెటర్ పూర్తిగా నకిలీదని, ఫోటోషాప్ సాయంతో సృష్టించబడిందని ఫ్యాక్ట్ చెక్ సంస్థలు తేల్చాయి. బీసీసీఐకి కానీ, సీఎస్కే యాజమాన్యం కానీ ఇలాంటి వింత ఫిర్యాదు ఏదీ చేయలేదని స్పష్టమైంది.

ఈ ఫేక్ లెటర్ ఇంతలా వైరల్ కావడానికి మరో కారణం ఉంది. ఇటీవల బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో స్థానిక డీజే సీఎస్కే ఆటగాళ్లను కించపరిచేలా వ్యవహరించాలని సీఎస్కే అధికారికంగా బీసీసీఐకి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన నిజం కావడంతో ఈ చేతబడి ఫిర్యాదు కూడా నిజమేనని చాలా మంది భ్రమపడ్డారు. ఐపీఎల్ అంటేనే జోష్.. అందులోనూ హైదరాబాద్-చెన్నై జట్ల మధ్య పోరు అంటే ఆ మజానే వేరు. ఈ క్రమంలో వచ్చే మీమ్స్ సరదాగా ఉన్నంత వరకు పర్వాలేదు కానీ, ఇలా అధికారిక లెటర్లను సృష్టించి భిప్రాయపడుతున్నారు.

# సన్‌రైజర్స్ లో ధురంధర్- ఒకే టికెట్ పై రెండు సినిమాలు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19 ఎడిషన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల పరంపర కొనసాగుతోంది. శనివారం రాత్రి ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో దూసుకెళ్లింది. నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్ లను ఆడిన సన్ రైజర్స్ మూడింట్లో నెగ్గింది. మొత్తం ఆరు పాయింట్లు ఉన్నాయి ఈ జట్టు ఖాతాలో. తొలుత బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ తొమ్మిది వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఛేదించడంలో చెన్నై తడబడింది. నిర్ణీత ఓవర్లలో 184 పరుగులు మాత్రమే చేయగలిగింది. చెన్నై ఇన్నింగ్ లో మాథ్యూ షార్ట్ ఒక్కడే టాప్ స్కోరర్. 34 పరుగులు చేశాడు. టాప్ ఆర్డర్ లో ఆయుష్ మాత్రే మినహా ఏ ఒక్కరు కూడా వేగంగా పరుగులు చేయలేకపోయారు. మాత్రే మాత్రమే 13 బంతుల్లో 30 పరుగులు బాదాడు. సంజు శాంసన్, రుతురాజ్ గైక్వాడ్, శివం దుబే వంటి బ్యాటర్లందరూ విఫలం అయ్యారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ లో ఓపెనర్ అభిషేక్ శర్మ మెరుపులు మెరిపించాడు. 15 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్ లో ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. 268. 18 స్ట్రైక్ రేట్ ను నమోదు చేశాడు. మరోవంక హెన్రిక్ క్లాసెన్ అర్ధ సెంచరీతో సత్తా చాటాడు. 39 బంతుల్లో 59 పరుగులు చేశాడు. మినిమం గ్యారంటీతో పరుగులు రాబట్టుకుంటోన్నాడు క్లాసెన్. ఇప్పటికే తన ఖాతాలో ఉన్న ఆరెంజ్ క్యాప్ ను వదులుకోవట్లేదు. ఇద్దరు మినహా మరెవెరూ భారీగా పరుగులు చేయలేకపోయారు.

ట్రావిస్ హెడ్ ఈ మ్యాచ్ లో కూడా విఫలం అయ్యాడు. 23 పరుగులు మాత్రమే చేశాడు. కేప్టెన్ ఇషాన్ కిషన్ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. అనికేత్ వర్మ- 2, నితీష్ కుమార్ రెడ్డి- 12, సలీల్ అరోరా- 13, లియామ్ లివింగ్ స్టన్- 1, శివాంగ్ కుమార్- 12 పరుగులు చేశారు. 195 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. వరుసగా వికెట్లు పడ్డాయి. పవర్‌ప్లే ముగిసే సమయానికి మూడు వికెట్లను కోల్పోయింది.

నితీష్ రెడ్డి బౌలింగ్‌లో సంజూ శాంసన్ (7 పరుగులు) తొలి వికెట్‌గా వెనుతిరగగా, ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్, ఆయుష్ కూడా పెవిలియన్ చేరారు. పవర్‌ప్లే ఆరు ఓవర్లలో చెన్నై మూడు వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. ఆ తర్వాత మాథ్యూ షార్ట్, సర్ఫరాజ్ ఖాన్ క్రీజులో నిలదొక్కుకున్నారు గానీ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పలేకపోయారు. మలింగ బౌలింగ్‌లో నితీష్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి సర్ఫరాజ్ ఖాన్ ఔటయ్యాడు. ఆ వెంటనే బ్రెవిస్ కూడా శివాంగ్ కుమార్ చేతికి చిక్కాడు. దీంతో 11 ఓవర్లలో 112/5 పరుగులు చేసింది.

ఈ దశలో చెన్నైకి మాథ్యూ షార్ట్, శివమ్ దూబే కాస్త ఆశలు రేకెత్తించినా, కీలక సమయంలో మాథ్యూ షార్ట్ వెనుతిరిగాడు. చివరి ఓవర్లలో శివం దూబే వేగంగా పరుగులు చేయాలని ప్రయత్నించాడు గానీ సాధ్యపడలేదు.

# మలుపు తిప్పిన మలింగా.. గెలిపించిన ప్రఫుల్ హింగే


ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శనివారం ఉప్పల్ స్టేడియం వేదికగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ పై గెలుపొందింది. ఇషాన్ మలింగా తీన్మార్ బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పితే.. ప్రఫుల్ హింగే ఆఖరి ఓవర్‌ను కట్టడిగా వేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. 195 పరుగుల లక్ష్యఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులకే పరిమితమై ఓటమిపాలైంది. ఆయుష్ మాత్రే(13 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 30), మాథ్యూ షార్ట్(30 బంతుల్లో 3 ఫోర్లతో 34), శివమ్ దూబే(16 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21) పోరాడినా ఫలితం లేకపోయింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(3/29) మూడు వికెట్లు తీయగా.. నితీష్ కుమార్ రెడ్డి(2/19) రెండు వికెట్లు పడగొట్టాడు. శివాంగ్ కుమార్(1/18), సాకిబ్ హుస్సేన్(1/32), ప్రఫుల్ హింగే(1/60) చెరో వికెట్ తీసారు .అంతకుముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 194 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(22 బంతుల్లో



6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59), హెన్రీచ్ క్లాసెన్(39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. సీఎస్‌కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్(3/22), జెమీ ఓవర్టన్(3/37) మూడేసి వికెట్లు తీయగా..ముఖేష్ చౌదరి(2/21) రెండు వికెట్లు పడగొట్టాడు. గుర్జప్నీత్ సింగ్(1/34)కు ఒక వికెట్ దక్కింది. మలుపు తిప్పిన మలింగా..195 పరుగుల లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయినా.. ఆయుష్ మాత్రే దూకుడైన బ్యాటింగ్‌తో ఆ జట్టు 76 పరుగులు చేసింది. ఆ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ మాథ్యూ షార్ట్ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేయగా.. మలింగా దెబ్బతీసాడు.

సర్ఫరాజ్ ఖాన్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే డేంజరస్ డెవాల్డ్ బ్రెవిస్(0)ను శివాంగ్ కుమార్ క్యాచ్ ఔట్ చేయడంతో మ్యాచ్ సన్‌రైజర్స్ వైపు మళ్లింది. మాథ్యూ షార్ట్(34)ను మలింగా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. శివమ్ దూబే(21)ను హుస్సేన్ క్లీన్ బౌల్డ్ చేయగా.. అన్షుల్ కంబోజ్ భారీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. గెలిపించిన ప్రఫుల్ హింగే..ఆఖరి ఓవర్‌లో సీఎస్‌కే విజయానికి 18 పరుగులు అవసరం కాగా.. ఇషాన్ కిషన్ ప్రఫుల్ హింగేకు బంతినిచ్చాడు. అప్పటికే అతను 3 ఓవర్లలో 53 పరుగులిచ్చుకోవడంతో అందరూ భయపడ్డారు. అందుకు తగ్గట్లే ప్రఫుల్ హింగే నోబాల్ వేసి టెన్షన్ పెట్టాడు. కానీ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో 7 పరుగులే ఇచ్చి జేమీ ఓవర్టన్‌ను ఔట్ చేశాడు. దాంతో సన్‌రైజర్స్ విజయం లాంఛనమైంది. రాజస్థాన్ రాయల్స్‌తో గత మ్యాచ్‌లోనూ ప్రఫుల్ హింగే మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన సంగతి తెలిసిందే. తన అరంగేట్ర మ్యాచ్ ఫస్ట్ ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి రాజస్థాన్ పతనాన్ని శాసించాడు. తాజా మ్యాచ్‌లో తొలి 3 ఓవర్లలో విఫలమైనా.. ఆఖరి ఓవర్‌ను కట్టుదిట్టంగా వేసి మరోసారి హీరో అయ్యాడు.

# టీ20ల్లో సంచలనం.. వైభవ్ వికెట్‌తో చరిత్ర సృష్టించిన మిస్టరీ స్పిన్నర్..



పొట్టి క్రికెట్‌లో భారత ఆటగాడు వరుణ్ చక్రవర్తి సంచలనం సృష్టించాడు. మిస్టరీ స్పిన్నర్‌గా పేరొందిన వరుణ్ రెండొందల వికెట్ల క్లబ్‌లో చేరాడు. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఔట్ చేయడం ద్వారా వరుణ్ ఈ ఫీట్ సాధించాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 200ల వికెట్లు తీసిన భారత స్పిన్నర్‌గా అవతరించాడు. మొత్తంగా.. ఐదో బౌలర్‌గా ఘనత సొంతం చేసుకున్నాడీ లెగ్ స్పిన్నర్. ఐపీఎల్ సంచలనంగా భారత జట్టులోకి వచ్చిన వరుణ్ చక్రవర్తి టీ20ల్లో రెండొందల వికెట్లు తీశాడు. పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్‌తో మళ్లీ ఫామ్ అందుకున్న ఈ లెగ్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ రికార్డును బ్రేక్ చేశాడు. చైనామన్ బౌలర్ కుల్దీప్ 160 ఇన్నింగ్స్‌ల్లో 200 వికెట్లు తీయగా వరుణ్ కేవలం 155 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ క్లబ్‌లో చేరాడు. అగ్రస్థానంలో అర్ష్‌దీప్ భారత బౌలర్లలో అందరికంటే తక్కువగా151 ఇన్నింగ్స్‌ల్లో రెండొందల వికెట్లతో అర్ష్‌దీప్ సింగ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జయదేవ్ ఉనాద్కాట్(162 ఇన్నింగ్స్‌లు), షమీ(165 ఇన్నింగ్స్‌లు)లు దక్కించుకున్నారు.

# కోల్‌కతా గెలిచిందోచ్

### రాయల్స్‌పై 4 వికెట్లతో గెలుపు
### ఛేదనలో మెరిసిన రింకు సింగ్
### రాజస్తాన్ 155/9 కోల్‌కతా 161/6

ఐపీఎల్19లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఎట్టకేలకు గెలుపు ఖాతా తెరిచింది. సీజన్లో తొలి ఆరు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించని కోల్‌కతా నైట్‌రైడర్స్.. ఈడెన్‌గార్డెన్స్‌లో రాజస్తాన్ రాయల్స్‌పై ఓ విజయం సాధించింది. 156 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 19.4 ఓవర్లలో ఛేదించి ఎట్టకేలకు గెలుపు ఊరట దక్కించుకుంది. రింకు సింగ్ (53 నాటౌట్, 34 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో కోల్‌కతాను గెలుపు తీరాలకు చేర్చాడు. అనుకూల్ రారు (29 నాటౌట్, 16 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలర్లు కార్తీక్ త్యాగి (3/22), వరుణ్ చక్రవర్తి (3/14), సునీల్ నరైన్ (2/26) మ్యాజిక్ చేశారు. రాయల్స్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (46, 28 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (39, 29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా ఇతర బ్యాటర్లు విఫలం అయ్యారు. మూడు వికెట్లతో మాయాజాలం చేసిన వరుణ్ చక్రవర్తి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. సీజన్లో తొలి 4 మ్యాచ్‌ల్లో గెలుపొందిన రాజస్తాన్ రాయల్స్‌కు ఇది వరుసగా రెండో ఓటమి.

రింకు అదుర్స్

కోల్‌కతా లక్ష్యం చిన్నదే. ఈడెన్‌గార్డెన్స్‌లో ఛేదన అదనపు అనుకూలత. కానీ, టాప్ ఆర్డర్ పేకమేడలా కుప్పకూలింది. టిమ్ సీఫర్ట్ (0), అజింక్య రహానె (0), రఘువంశీ (10) దారుణంగా విఫలమయ్యారు. కామెరూన్ గ్రీన్ (27, 13 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రోవ్‌మాన్ పావెల్ (23, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఎదురుదాడి చేసినా వికెట్లు కోల్పోయారు. 11 ఓవర్లలో 73/5తో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓటమి కోరల్లో కూరుకుంది. ఈ



సమయంలో రింకు సింగ్ వ్యక్తిగత స్కోరు 8 వద్ద సింపుల్ క్యాచ్‌ను బర్గర్ వదిలేశాడు. అప్పటికి కోల్‌కతా 54 బంతుల్లో 83 పరుగులు చేయాల్సి ఉంది. జీవనదానం లభించటంతో రింకు సింగ్ రెచ్చిపోయాడు. అజేయ అర్ధ సెంచరీతో విజృంభించాడు. 2 సిక్స్‌లు, ఐదు ఫోర్లతో కదం తొక్కాడు. లోయర్ ఆర్డర్‌లో రమణ్‌దీప్ సింగ్ (10), అనుకూల్ రారు (29 నాటౌట్) రింకు సింగ్‌కు చక్కటి సహకారం అందించారు. అనుకూల్ రారుతో కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 76 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రింకు సింగ్.. నైట్‌రైడర్స్‌కు సీజన్లో తొలి విజయాన్ని అందించాడు. రాజస్తాన్ రాయల్స్ బౌలర్లలో రవీంద్ర జడేజా (2/8) మాయ చేయగా.. జోఫ్రా ఆర్చర్, బర్గర్, బిష్ణోరు, యశ్ రాజ్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు.

ఓపెనర్లు మెరిసినా..

ఈడెన్‌గార్డెన్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ రాయల్స్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభం అందించారు. వైభవ్ సూర్యవంశీ (46), యశస్వి జైస్వాల్ (39) తొలి వికెట్‌కు 8.4 ఓవర్లలో 81 పరుగులు జోడించారు. వైభవ్ సూర్యవంశీ మెరుపులతో పవర్‌ప్లేలోనే రాయల్స్ 63 పరుగులు జోడించింది. యశస్వి జైస్వాల్ ధనాధన్ జోరు చూపించలేదు, కానీ వైభవ్‌కు చక్కటి సహకారం అందించాడు. 2 సిక్స్‌లు, 4 ఫోర్లతో కదం తొక్కాడు. ఓపెనర్ల జోరుతో భారీ స్కోరు దిశగా సాగుతున్న రాయల్స్‌కు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేసర్ కార్తీక్ త్యాగి ముకుతాడు వేశారు. చెరో మూడు వికెట్లు పడగొట్టి రాయల్స్ పతనాన్ని శాసించారు. ధ్రువ్ జురెల్ (5), రియాన్ పరాగ్ (12), షిమ్రోన్ హెట్‌మయర్ (15), డొనొవన్ ఫెరీరా (7), రవీంద్ర జడేజా (9) పరుగుల వేటలో విఫలమయ్యారు. టెయిలెండర్లు ఆర్చర్ (8), రవి బిష్ణోరు (0), బ్రిజేశ్ శర్మ (1 నాటౌట్) సైతం ఆఖర్లో ధాటిగా ఆడలేకపోయారు. దీంతో రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులకే పరిమితమైంది. తొలి పది ఓవర్లలో 95 పరుగులు చేసి ఓ వికెట్ కోల్పోయిన రాయల్స్‌ ఆ తర్వాతి పది ఓవర్లలో 8 వికెట్లు చేజార్చుకుని కేవలం 60 పరుగులే చేసింది. పవర్‌ప్లే తర్వాత నైట్‌రైడర్స్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, పేసర్ కార్తీక్

# ధర్మ రక్షణ కోసం పరశురాముడి ఆగమనం.. 'మహావతార్ పరశురామ్' మోషన్ పోస్టర్ రిలీజ్

భారతీయ చలనచిత్ర రంగంలో యానిమేటెడ్ చిత్రాల సత్తాను చాటిన 'మహావతార్ నరసింహ' అఖండ విజయం తర్వాత, 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రెండో అడుగు పడింది. హోంబలే ఫిల్మ్స్ మరియు క్లీమ్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం "మహావతార్ పరశురామ్" మోషన్ పోస్టర్‌ను నేడు పరశురామ జయంతి సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసింది.కేవలం 40 కోట్ల బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద 300 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించిన 'మహావతార్ నరసింహ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు అశ్విన్ కుమార్ విష్ణుమూర్తి దశావతారాల ఆధారంగా మొత్తం ఏడు చిత్రాలను ఈ యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తుండగా, రెండో చిత్రంగా




పరశురాముడి కథను ఎంచుకున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో యుద్ధ భూమిలో రక్తసిక్తమైన గొడ్డలిని ధరించి, రౌద్ర రూపంలో ఉన్న పరశురాముడిని చూపిస్తూ "ధర్మం పతనమైనప్పుడు పరశురాముడు ఉద్భవిస్తాడు.. ఆయన పాలకుడు కాదు, అధర్మాన్ని అంతమొందించే శక్తి" అని పేర్కొనడం విశేషం. సామ్ సి.ఎస్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం అత్యాధునిక 3ఞ యానిమేషన్ సాంకేతికతతో సిద్ధమవుతోంది. విజయ్ కిరగందూర్ నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రం తెలుగు, కన్నడ, హిందీ, తమిళం కానుంది.

# వాలీబాల్ నేపథ్యంలో టాలీవుడ్ తొలి స్పోర్ట్స్ డ్రామా.. 'వాలీ' మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన క్రిష్

ప్రముఖ దర్శకుడు క్రిష్ జగర్లమూడి చేతుల మీదుగా విడుదలైన 'వాలీ' చిత్ర మోషన్ పోస్టర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టాలీవుడ్ తెరపై వాలీబాల్ క్రీడ నేపథ్యంలో వస్తున్న మొట్టమొదటి స్పోర్ట్స్ డ్రామాగా గుర్తింపు పొందిన ఈ చిత్రం, టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఫైర్‌వాటర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై జి. రోహన్ రెడ్డి నిర్మాణంలో, దిలీప్ కె. మనుకొండ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను క్రిష్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మోషన్ పోస్టర్ చూస్తుంటే, ఒక గ్రామీణ నేపథ్యంలో సాగే క్రీడా పోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారని స్పష్టమవుతోంది.

ఈ చిత్రం ప్రధానంగా తీరప్రాంత గ్రామీణ వాతావరణంలో సాగుతుంది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉండే అనుబంధం, వారి జీవితాల్లో వాలీబాల్ క్రీడ పోషించే కీలక పాత్ర, మైదానంలో వారు ఎదుర్కొనే సవాళ్లు మరియు వ్యక్తిగత భావోద్వేగాల చుట్టూ కథాంశాన్ని అత్యంత ఆసక్తికరంగా మలిచారు. ఈ సినిమాతో రోనిత్ జీఆర్‌జీ కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతుండగా, నిపుణ్ సత్య మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. వీరిద్దరి నటన ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం




చేస్తోంది. ఇక అభిగ్న్య వుత్తలూరు కథానాయికగా అలరించనుండగా, రవి వర్మ, కల్పలత, వడ్లమాని శ్రీనివాస్ వంటి అనుభవం ఉన్న నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

సాంకేతికంగా కూడా ఈ చిత్రం ఉన్నత ప్రమాణాలతో రూపొందుతోంది. అరుణ్ విజేకే సినిమాటోగ్రఫీ, ఔరానోవా స్టూడియోస్ అందించిన నేపథ్య సంగీతం మోషన్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. పవన్ కె. విప్పర్తి మరియు దిలీప్ కె. మనుకొండ సంయుక్తంగా అందించిన కథ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఉంటాయని సమాచారం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ వంటి అందమైన తీరప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. జి విక్రమ్ రెడ్డి సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్టుకు శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు.

# అర్జున్ అంబటి యాక్షన్ థ్రిల్లర్... శ్రీవిష్ణు చేతుల మీదుగా 'పరమపద సోపానం' ట్రైలర్ లాంచ్

అర్జున్ అంబటి హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'పరమపద సోపానం' ట్రైలర్‌ను హీరో శ్రీవిష్ణు విడుదల చేశారు. పూరీ జగన్నాథ్ శిష్యుడు నాగ శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించే అంశాలతో రూపొందింది. ట్రైలర్ లోని యాక్షన్ సన్నివేశాలు, రొమాంటిక్ ట్రాక్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. దేవ్ జాండ్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని స్వయంభూ క్రియేషన్స్ నిర్మించింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా సిద్ధమైన ఈ సినిమా ఏప్రిల్ 24న థియేటర్లలో సందడి చేయనుంది.టాలీవుడ్ యువ నటుడు అర్జున్ అంబటి కథానాయకుడిగా నటిస్తున్న



సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'పరమపద సోపానం'. వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై టాలీవుడ్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో, 'కింగ్ ఆఫ్ కంటెంట్' శ్రీవిష్ణు విడుదల చేసి చిత్ర బృందానికి తన మద్దతును ప్రకటించారు.స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ వద్ద శిష్యరికం చేసిన నాగ శివ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ట్రైలర్ చూస్తుంటే పూరీ స్టైల్‌లోని మాస్ అండ్ క్లాస్ అంశాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హీరో అర్జున్ అంబటిని ప్రెజెంట్ చేసిన తీరు, యాక్షన్ సన్నివేశాలు మరియు రొమాంటిక్ ట్రాక్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో ఒక బలమైన సామాజిక అంశాన్ని కూడా చర్చించబోతున్నట్లు స్పష్టమవుతోంది.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా.. సంప్రదాయ దుస్తుల్లో మిల్కీ బ్యూటీ

ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి చేరుకున్న ఆమె, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తన తిరుమల పర్యటనకు సంబంధించిన ఫోటోలను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, తమన్నా తదుపరి చిత్రం 'వ్వాన్' నటించబోతున్నారు. ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రలో కనిపిస్తుండగా,



దీపక్ మిశ్రా మరియు అరుణాభ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం రక్షా బంధన్ కానుకగా ఈ ఏడాది ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది.


# తెలుగులో ప్యూర్ ఛిల్లింగ్ హార్రర్ ఫిల్మ్: మైత్రీ- ప్రశాంత్ నీల్ బిగ్ ప్లాన్

టాలీవుడ్ లో భారీ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పేరుపొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ రూట్ మార్చింది. ఓ ప్రయోగానికి తెర తీసింది. ఇప్పుడు హారర్ జానర్‌లోకి ప్రవేశిస్తోంది. కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ తో కలిసి ఓ ఛిల్లింగ్ హార్రర్ మూవీని నిర్మిస్తోంది. ఈ సినిమా టైటిల్ ను కూడా ఆవిష్కరించిందీ ప్రొడక్షన్ హౌస్. దీనికి సంబంధించిన ఓ పోస్టర్ రిలీజ్ అయింది. ఫస్ట్ లుక్ లోనే ఏదో ఉందనిపించేలా చేసింది.ఈ మూవీ టైటిల్.. 418. ప్రశాంత్ నీల్ సమర్పణలో ఈ సినిమా తెరకెక్కుతోంది. యువ దర్శకుడు కీర్తన్ నాడగౌడ రూపొందిస్తోన్నారు. సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హార్రర్ జానర్ లో మైత్రీ మూవీ మేకర్స్ అడుగు పెట్టడం, దీనికోసం ప్రశాంత్ నీల్ తో కొలాబరేట్ కావడం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయింది.టైటిల్ రిలీజ్ పోస్టర్ లో 418 అనే నంబర్ ప్రధానంగా కనిపిస్తోంది. రక్తపు మరకలతో లాక్ చేసి ఉన్న తలుపుపై ఆ అక్షరాలు ఉండటం.. సినిమా డెప్త్ ను సూచిస్తోంది. మూసివున్న తలుపుల వెనుక ఉన్మ మర్మం, 418 అనే అంకెల అంతరార్థం హాట్ టాపిక్ అయింది. డార్క్ సీక్రెట్స్, లోన్లీ నెస్.. ఇలా అన్నీ ఈ పోస్టర్ లో కలబోశాయి. ఎటువంటి కామెడీ లేకుండా ప్యూర్ హార్రర్ జానర్ లో తెరకెక్కుతోందనడానికి ఇవే ఉదాహరణలు."హారర్ సినిమాల్లో నవ్వడం ఇక చాలు.. ఇప్పుడు భయపడాల్సిన సమయం వచ్చింది.." అనే ట్యాగ్‌లైన్ కూడా పెట్టాడంటే దర్శకుడు కీర్తన్




నాడగౌడ గట్స్ హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. పకడ్బందీ స్క్రీన్ ప్లేతో బౌండ్ స్క్రిప్ట్ రెడీ చేశాడాయన. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న హారర్-కామెడీ జానర్ కు ఓ సవాల్. ఈ సినిమాకు వెంకీ జీజీ సంగీతం అందించగా, దినేష్ దివాకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూసుకున్నారు. '418'లోని మిగిలిన నటీనటులు, సాంకేతిక ప్రకటించనున్నారు.

# ఆధ్యాత్మిక కలయిక.. 'వాల్మీకి రామాయణం' కోసం జతకట్టిన ఇళయరాజా




భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్టాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.భావనా తల్వార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం, వాల్మీకి మహర్షి రచించిన అసలు సిసలు రామాయణ ఇతిహాసాన్ని వెండితెరపై ఆవిష్కరించనుంది. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి ఇళయరాజా తన సంగీతంతో ప్రాణం పోయనున్నారు. విజువల్స్ మరియు సంగీతం పరంగా అత్యున్నత ప్రమాణాలతో రూపు దిద్దుకుంటున్న ఈ చిత్రం 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల కానుంది.

# పవన్ కళ్యాణ్ హెల్త్ అప్‌డేట్ ఇచ్చిన చిరంజీవి..

## స్పందించిన అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్


ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స విజయవంతమైందని, ఆయన క్షేమంగా ఉన్నారని మెగాస్టార్ చిరంజీవి వెల్లడించారు. పవన్ కోలుకోవడానికి వారం రోజులు సమయం పడుతుందని, అభిమానులు ఆందోళన చెందవద్దని కోరారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలు పవన్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఆయన తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని వారందరూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కి శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగిందనే సంగతి తెలిసిందే. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పలువురు సినీ రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. తన తమ్ముడి ఆరోగ్య పరిస్థితిపై మెగాస్టార్ చిరంజీవి తాజాగా అప్‌డేట్ ఇచ్చారు. పవన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. "కళ్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నారు. ఆరోగ్యం నిలకడగా ఉంది. బాగా కోలుకుంటున్నారు. వైద్యులు చెప్పిన దాని ప్రకారం, ఆయన తన సాధారణ దినచర్యకు తిరిగి రావడానికి సుమారు ఒక వారం పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, శ్రద్ధకు, ప్రార్థనలకు ధన్యవాదాలు. మనమందరం ఆయనను మన ఆలోచనలలో ఉంచుకుని, ఆయనకు మనోధైర్యం, ఓదార్పు లభించాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిద్దాం" అని చిరంజీవి పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా కూడా ఇన్స్టాగ్రామ్ వేదికగా హెల్త్



అప్డేట్ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పోస్టుని ఇన్స్టా స్టోరీలో పెడుతూ.. "ఆయన కోలుకుంటున్నాడు. అంతా బాగానే ఉంది. థ్యాంక్యూ" అని పోస్ట్ చేశారు. మరోవైపు జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్, సాయి దుర్గ తేజ్ తదితరులు పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై స్పందించారు. ఆయన త్వరగా కోలుకోవాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు."ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. నూతనోత్సాహంతో, సంపూర్ణ ఆరోగ్యంతో మీరు త్వరలోనే తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాను" అని ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. "ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు త్వరగా కోలు కోవాలని, ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. మీరు త్వరలోనే పూర్తి శక్తితో తిరిగి రావాలని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ పోస్ట్ చేశారు."ఆంధ్రప్రదేశ్ గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. గతంలో కంటే మరింత దృఢంగా, మీరు తిరిగి విధుల్లోకి రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని రామ్ చరణ్ పేర్కొన్నారు. "నా ప్రియమైన చిన్న మామయ్య పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి. ప్రజల ప్రేమ, ప్రార్థనలతో పాటు.. మీరు త్వరగా కోలుకోవాలని కోరుతూ నా ప్రగాఢమైన ప్రేమను మీకు పంపుతున్నాను. శస్త్రచికిత్స చాలా విజయవంతంగా జరిగింది. మీరు మళ్ళీ అతి త్వరలోనే ప్రజలకు సేవ చేయడం చూడాలని నేను ఆశిస్తున్నాను. మీ అమూల్యమైన ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి" అని సాయి దుర్గ తేజ్ ఎక్స్ లో పోస్ట్ చేశారు.

# ఏకతాటిపైకి దక్షిణాది సినీ నిర్మాతలు...

## 'సిఫ్పా' పేరిట కొత్త సంఘం ఏర్పాటు



దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖ నిర్మాతలు, ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చారు. సినీ నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్' పేరుతో ఒక కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేశారు.

థియేట్రికల్ నిబంధనలు, 8 వారాల ఓటీటీ విడుదల గడువు వంటి కీలక అంశాలపై పరిశ్రమలోని ఇతర వర్గాలు తమతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని ఈ సమావేశం తీవ్రంగా ఖండించింది. వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న సినిమా నిర్మాణ వ్యవస్థను ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదని, ఇలాంటి ఆకస్మిక మార్పులు నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, గందరగోళానికి దారితీస్తాయని నిర్మాతలు అభిప్రాయపడ్డారు. నిర్మాత ప్రయోజనాలను దీర్ఘకాలికంగా కాపాడే లక్ష్యంతోనే 'సిఫ్పా'ను ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు.

తక్షణ సమస్యల పరిష్కారం, నాలుగు పరిశ్రమల మధ్య సమన్వయం కోసం ప్రతి పరిశ్రమ నుంచి ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న నిర్మాణ ప్రక్రియలు, హక్కుల విక్రయాలు, విడుదల ప్రణాళికలను యథాతథంగా కొనసాగించాలని తెలిపారు. ముఖ్యంగా, ఓటీటీ విడుదల గడువుకు సంబంధించి ఏ సంఘానికి గానీ, రంగానికి గానీ ఎలాంటి హామీ పత్రాలు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలాంటి నిబంధనలపై సమిష్టి చర్చల ద్వారానే తుది నిర్ణయం తీసుకోవాలని, అప్పుడే నిర్మాతలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సినిమాకు ప్రాథమిక పెట్టుబడిదారు, నష్టభయాన్ని భరించేది నిర్మాతే కాబట్టి, పరిశ్రమకు సంబంధించిన అన్ని నిర్ణయాధికార ప్రక్రియలలో నిర్మాతదే సార్వభౌమాధికారం అని ఈ సమావేశం పునరుద్ఘాటించింది. ఈ కొత్త స్టీరింగ్ కమిటీ తరచూ సమావేశమై నిర్మాత ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని ప్రకటనలో తెలిపారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613